నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం నేటినిజం

**నేటి కందం- నేటికీ అందం**

దీవింపబడగ-సభ్యులు
కావించగ నంతరాత్మ కలబోధనమున్
పావనుడగు రాష్ట్రపతిగ
వీ వీ గిరి ఎన్నికయ్యె విబుధులు మెచ్చన్

(24-8-1969 అంతరాత్మ ప్రబోధంతో వీ వీ గిరి రాష్ట్రపతిగా ఎన్నికైన రోజు)



-రాధశ్రీ
సెల్:9494481210

# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website2:www.netinijam.com2 ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 E-mail : netinijam93@gmail.com

**చురక**

రాజకీయ విమర్శల్లో
రగులుటేల రుణమాఫీ
అనుభవించే రైతుల్లో
ఆనందం కళ్ల చూపి
నిన్న పూర్తి చేయనోళ్లు
నేడు అడిగే నైతికేది
వాస్తవాలు కప్పుపుచ్చి
వార్ అంటే వట్టి సోది



-వేల్పుల నారాయణ
9440433475

హైదరాబాద్ శనివారం 24-8-2024 NETI NIZAM Telugu Daily, RNI No.52865/93· Postal No. HQ/SD/258/2024-2026 సంపుటి :31 సంచిక:19 పేజీలు:6 వెల: రూ.1/-

## భారత్ నెట్ ఫేజ్-3లో టి ఫైబర్ ప్రాజెక్టను చేర్చండి - రేవంత్



న్యూఢిల్లీ, ఆగష్టు 23: టీ-ఫైబర్ ప్రాజెక్టును భారత్ నెట్ ఫేజ్-3లో చేర్చాలని తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కేంద్ర టెలికం శాఖ మంత్రి జ్యోతిరాదిత్య సింధియాను కోరారు. ఢిల్లీ పర్యటనలో ఉన్నరేవంత్ సహచర ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క, మంత్రి జూపల్లి కృష్ణారావుతో కలసి నేడు సింధియాను ఆయన కార్యాలయంలో కలిశారు.. తెలంగాణ ప్రాంతంలోని గ్రామాలు, మండలాలకు టీ ఫైబర్ నెట్ వర్క్ కల్పించడమే లక్ష్యంగా పెట్టుకున్నామని కేంద్రమంత్రికి రేవంత్ తెలిపారు. 65 వేల ప్రభుత్వ సంస్థలకు జీ2జీ, జీ2సీ సేవలు అందించడమే కాకుండా, గ్రామీణ ప్రాంతాల్లో 63 లక్షల ఇళ్లకు ఇంటర్నెట్ సౌకర్యం కల్పించే దిశగా ముందుకు సాగుతున్నామని చెప్పారు.. ఈ నేపథ్యంలోనే టి ఫైబర్ ప్రాజెక్ట్ ను బారత్ నెట్ ఫేజ్ 3 లో చేర్చాలని కోరుతూ డిపిఆర్ ను కేంద్ర మంత్రికి సమర్పించారు.. దీనిని ఆమోదించాలని కోరారు.. సానుకూలంగా స్పందించిన కేంద్ర మంత్రి అవకాశాలను పరిశీలిస్తామని హామీ ఇచ్చారు.

## రాష్ట్రీయ బాల పురస్కారాలకు దరఖాస్తుల ఆహ్వానం

హైదరాబాద్, ఆగష్టు 23 :రాష్ట్రీయ బాల పురస్కాంఅవార్డు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు జిల్లా సంక్షేమ అధికారి ఇ. అక్కేశ్వం రావు శుక్రవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వివిధ రంగాల్లో ప్రతిభ చాటిన బాలబాలికలకు ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ 2025 అవార్డు కోసం దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్టు ఆయన తెలిపారు. 5 ఏండ్ల నుంచి 18 ఏండ్ల లోపు బాల బాలికలు అర్హులని వివరించారు. ధైర్య సాహసాలు, సోషల్ సర్వీస్, క్రీడలు, సర్యావరణం, సాంస్కృతిక కళలు, సైన్స్ అండ్ టెక్నాలజీ వంటి సేవా రంగాల్లో ప్రావీణ్యం కలిగి ఉండాలని చెప్పారు. ఆన్‌లైన నేషనల్ అవార్డ్ పోర్టల్ జీలివతీటబ.ఇనీల.తిని లో ఆగస్టు 31లోపు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

## ఇప్పటికే రూ.18 వేల కోట్లు ఇచ్చాం..మరో 12 వేల కోట్లు ఇస్తాం.. మంత్రి పొంగులేటి




హైదరాబాద్, ఆగష్టు 23 :ప్రభుత్వం ఏర్పాటైన 100 రోజుల్లోనే ఐదు గ్యారెంటీలను అమలు చేశామని మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి అన్నారు. గత ప్రభుత్వం రూ.7 లక్షల కోట్ల అప్పులు చేసిందని, అయినప్పటికీ తాము హామీలు నెరవేర్చామన్నారు. ధనిక రాష్ట్రమని చెప్పి కేసీఆర్ ప్రజలను మోసం చేశారని మండిపడ్డారు. తాము ఇతర ఖర్చులను తగ్గించుకొని రుణమాఫీ చేశామన్నారు. 22 లక్షల మంది రైతులకు రూ.2 లక్షల వరకు మాఫీ చేశామన్నారు. రైతుల ఖాతాల్లో ఇప్పటికే రూ.18 వేల కోట్లు జమ అయ్యాయని, మిగిలిన రైతుల ఖాతాల్లోను మరో రూ.12 వేల కోట్లు త్వరలో వేస్తామన్నారు.

గాంధీ భవన్‌లో ఆయన నేడు మీడియాతో మాట్లాడుతూ, కేసీఆర్ ప్రభుత్వంలా తాము మోసం చేయడం లేదన్నారు. రుణమాఫీ విషయంలో గత ప్రభుత్వం రైతులను రెండుసార్లు మోసం చేసిందని మండిపడ్డారు. ఎన్నికలకు ముందు కూడా కొందరికే రుణమాఫీ చేశారన్నారు. ప్రచారం కోసం గత ప్రభుత్వంలా వేల కోట్ల రూపాయలను వృథా చేయడం లేదన్నారు.

ఉచిత విద్యుత్ కోసం 42 లక్షల దరఖాస్తులు మాత్రమే సక్రమంగా ఉన్నట్లు గుర్తించామన్నారు. తప్పులను సవరించి మరో 7 లక్షల మందికి పైగా ఉచిత విద్యుత్ వర్తింప చేస్తున్నామన్నారు. ఉచిత విద్యుత్, రూ.500కే గ్యాస్ రాయితీ లబ్ధిదారుల సంఖ్య నిత్యం పెరుగుతోందన్నారు. దరఖాస్తుల్లో తప్పులు ఉంటే సవరణలు చేస్తున్నట్లు చెప్పారు. 18 రాష్ట్రాల రెవెన్యూ చట్టాలను అధ్యయనం చేసి కొత్త ఆర్వోఆర్‌ను తీసుకువస్తున్నామన్నారు. ఇది దేశానికే రోల్ మోడల్ అన్నారు.

హైడ్రాను మంచి ఉద్దేశంతో తెచ్చాం..

హిమయత్ సాగర్ ప్రాంతంలో ఎఫ్‌టీఎల్ పరిధిలో తనకు ఫామ్ హౌస్ ఉందని బీఆర్ఎస్ మీడియా బురద జల్లుతోందని, తన ఇల్లు అక్రమంగా ఉంటే వెంటనే కూల్చివేయాలని హైడ్రా కమిషనర్‌ను ఆదేశిస్తున్నానని మంత్రి పొంగులేటి అన్నారు.

అధికారులకు బదులు బీఆర్ఎస్ వాళ్లే వెళ్లి కొలవాలని, అక్రమమని తేలితే కూల్చేసుకోండని కేటీఆర్, హరీశ్ రావులకు సవాల్ విసిరారు. హైడ్రాను తాము ఓ మంచి ఉద్దేశంతో తెచ్చామన్నారు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్ పరిధిలోని నిర్మాణాలను అనుమతించేది లేదన్నారు. అలాంటి కట్టడాలను కూల్చివేస్తున్నామన్నారు. అవన్నీ గత ప్రభుత్వం హయాంలో జరిగిన నిర్మాణాలేనని విమర్శించారు

## బల్దియా అధికారుల నిర్వాకం.. మేయర్ పేరుతో డ్రగ్‌మార్ట్ లైసెన్స్

హైదరాబాద్, ఆగష్టు 23 : జీహెచ్ఎంసీ ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో అధికారుల మొద్దు నిద్రకు ఇదో మచ్చుతునక?ఆన్‌లైన్‌లో రూ. 350లు చెల్లిస్తే చాలు.. ఎలాంటి పత్రం లేకపోయినా, దుకాణం ఉందా? అనే అంశంతో సంబంధం లేకుండా, అధికారుల క్షేత్రస్థాయి విచారణ జరపకుండా ట్రేడ్ లైసెన్స్ జారీ అవుతుంది. అంతేకాదు అది ఏ వ్యాపారం, ఎవరు దరఖాస్తు చేసుకున్నారు.. అనేది చూడకుండా లైసెన్స్‌ను మంజూరు చేస్తున్నారు. ట్రేడ్ లైసెన్స్‌ల జారీలో లోపాలు మరోసారి వెలుగులోకి వచ్చాయి.

ఇప్పటికే మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేరిట మల్కాజిగిరి జీహెచ్ఎంసీ సర్కిల్ కార్యాలయం భవనానికి యజమానిగా పేర్కొంటూ.. నకిలీ ఇంటి నంబరును ఇచ్చేశారు. ఈ వ్యవహారంపై కౌన్సిల్ సమావేశంలో తీవ్ర దుమారం రేగింది. తాజాగా బీజేపీ కార్పొరేటర్ శ్రవణ్ ట్రేడ్ లైసెన్సుల జారీలో లోపాలను ప్రత్యేక్షంగా ఎత్తిచూపారు. జీహెచ్ఎంసీ వెబ్‌సైట్‌లోని ఆన్‌లైన్ దరఖాస్తులో మేయర్ గద్వాల్ విజయలక్ష్మి పేరును చేర్చి, డ్రగ్ మార్ట్ వ్యాపారాన్ని తెరిచేందుకు ఒక లైసెన్స్, మరొకటి 'డ్రగ్స్ మార్ట్ ఇన్ కాంగ్రెస్' పేరుతో కావాలంటూ పలు తెల్ల కాగితాలను అప్‌లోడ్ చేసి లైసెన్స్‌లు పొందడం గమనార్హం.

గ్రేటర్‌లో ఏదైనా వ్యాపారం నిర్వహించాలంటే ట్రేడ్ లైసెన్స్ తప్పనిసరి. అధికారులతో సంబంధం లేకుండా పౌరులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకొని అప్పటికప్పుడే లైసెన్స్‌లు పొందేందుకు వీలుండటంతో తమకు కావాల్సిన లైసెన్స్ సర్టిఫికెట్లను సృష్టించుకునే అవకాశం కల్పించినట్లయింది. దీంతో కొందరు బల్దియా 'ఇన్‌స్టాంట్ అప్రూవల్' విధానాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. నాలుగేండ్లలో రూ. 50కోట్ల నష్టం వాటిల్లినట్లు అంచనా. ట్రేడ్ లైసెన్స్‌ల జారీ విభాగాన్ని సమూల ప్రక్షాళన చేయాల్సిన అవసరమున్నదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

## నేపాల్ నదిలో పడ్డ యూపీ బస్సు.. 14కు చేరిన మృతుల సంఖ్య..!

న్యూఢిల్లీ, ఆగష్టు 23:ఉత్తరప్రదేశ్ రాష్ట్రానికి చెందిన ఓ టూరిస్టు బస్సు యాత్రికులతో వెళ్తూ.. అదుపుతప్పి నేపాల్ లోని తానాహున్ జిల్లాలో మార్స్యాంగ్డి నది లో పడిపోయింది. అనంతరం ఒడ్డుకు కొట్టుకుని వచ్చింది. ఈ ప్రమాదంలో మృతుల సంఖ్య 14కు చేరింది. అయితే ప్రమాద సమయంలో బస్సులో మొత్తం 40 మంది యాత్రికులు ఉన్నట్లు అధికారులు తెలిపారు.

బస్సు నదిలో పడిన సమాచారం అందిన వెంటనే స్థానిక పోలీసులు, అధికారులు ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. ఇప్పటివరకు మొత్తం 14 మృతదేహాలను వెలికి తీశారు. ఇంకా సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. మిగతా 26 మృతదేహాల కోసం రెస్క్యూ సిబ్బంది గాలిస్తున్నారు. దాంతో మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని అధికారులు చెబుతున్నారు.

కాగా 'భారత్‌కు చెందిన యూపీ ఎఫ్‌టీ 7623 (ఐఖ ఈు 7623) నెంబర్‌గల బస్సు ఈ ఉదయం మార్స్యాంగ్డి నదిలోకి దూసుకుపోయింది. బస్సు పొఖారా నుంచి ఖాట్మండుకు వెళ్తుండగా ఈ ప్రమాదం జరిగింది.

## ఆందోళనకారులపై భాష్పవాయుగోళాలు ప్రయోగించిన పోలీసులు



జార్ఖండ్, ఆగష్టు 23 :జార్ఖండ్ రాజధాని రాంచి రణరంగమైంది. నిరుద్యోగ యువతకు రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరుతూ బీజేపీ యువమోర్చా నేతల ఆందోళనపై పోలీసులు విరుచుకుపడ్డారు. నిరసన ప్రదర్శనలను అడుగడుగునా అడ్డగించి ఆందోళనకారులను చెదరగొట్టేందుకు పోలీసులు భాష్పవాయుగోళాలను ప్రయోగించడంతో పాటు లాఠీలకు పనిచెప్పారు.

బీజేపీ నేతలు, కార్యకర్తలను అడ్డుకోవడంతో తీవ్ర ఉద్రిక్తత నెలకొంది. కాగా, సమస్యలపై యువత కదం తొక్కడంతో జార్ఖండ్‌లో హేమంత్ సోరెన్ నేతృత్వంలోని జేఎంఎం సర్కార్ దిక్కుతోచని స్థితిలోకి వెళ్లిందని కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ అన్నారు. న్యాయం కోసం పోరుబాట పట్టిన యువతపై లాఠీచార్జితో సోరెన్ సర్కార్ విరుచుకుపడిందని విమర్శించారు. నిరుద్యోగ యువతను నిలువరించి లాఠీచార్జి చేశారని ఆరోపించారు. హేమంత్ సోరెన్ సర్కార్‌కు నూకలు చెల్లాయని ఈ ప్రభుత్వం రెండు నెలల్లో దిగిపోతుందని దుయ్యబట్టారు. ఐదు లక్షల ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి ఇస్తామన్న ప్రభుత్వం కనీసం ఒక్క హామీ కూడా నెరవేర్చలేదని మండిపడ్డారు. దీనిపై బీజేపీ యువమోర్చా కార్యకర్తలు ఆందోళన చేపడితే జేఎంఎం విధ్వంసానికి తెగబడిందని అన్నారు.

## తెలంగాణలో మరో 5 రోజుల పాటు వర్షాలు.. ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ



హైదరాబాద్, ఆగష్టు 23 : ఉత్తర పశ్చిమ బెంగాల్, ఈశాన్య జార్ఖండ్ ప్రాంతాల్లో అల్పపీడన ప్రభావం కొనసాగుతుంది. దీనికి అనుబంధంగా ఆవర్తనం సగటు సముద్ర మట్టానికి 7.6 కి.మీ ఎత్తులో కేంద్రీకృతమైంది. దీని ప్రభావంతో రాష్ట్రవ్యాప్తంగా వర్షాలు కురుస్తుండగా.. మరో 5 రోజుల పాటు భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం హెచ్చరించింది. పలు జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు ఎల్లోఅలర్ట్ జారీచేసింది.

ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, జగిత్యాల, భద్రాద్రి కొత్తగూడెం, ఖమ్మం, మెదక్, ములుగు జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ తెలిపింది. ఉరుములు, మెరుపులతో కూడిన భారీవర్షాలు కురుస్తాయని పేర్కొంది. గంటకు 30 నుంచి 40 కిలోమీటర్ల వేగంతో గాలులు వీస్తాయని తెలిపింది. ముఖ్యంగా.. నిర్మల్, నిజామాబాద్, రంగారెడ్డి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో భారీ వర్షాలు కురిసే అవకాశాలు ఎకువగా ఉన్నాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. శనివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, వనపర్తి, నారాయణపేట జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశం ఉందని అధికారులు తెలిపారు. ఆదివారం ఆదిలాబాద్, కుమ్రంభీం ఆసిఫాబాద్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్నసిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, జయశంకర్ జనగామ, సిద్దిపేట, యాదాద్రి-భువనగిరి, హైదరాబాద్, మేడ్చల్-మల్కాజిగిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ భారీ వర్షాలు కురిచే ఛాన్స్ ఉందని వివరించారు. ఈ మేరకు ఆయా జిల్లాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భారీ వర్షాల నేపథ్యంలో.. ఇప్పటికే అధికారులను ప్రభుత్వం అప్రమత్తం చేసింది. భారీ వర్ష సూచన ఉన్న ప్రాంతాల పట్ల కలెక్టర్లు దృష్టి పెట్టాలని ప్రభుత్వం ఆదేశించింది. ఆయా ప్రాంతాల్లో వర్షాభావ పరిస్థితులను బట్టి.. స్కూళ్లకు సెలవుల విషయంలో కలెక్టర్లు నిర్ణయం తీసుకోవాలని సూచించింది.

## ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, డీజీపీకి నోటీసులు జారీ

న్యూఢిల్లీ, ఆగష్టు 23:ఆంధ్రప్రదేశ్ అనకాపల్లి జిల్లాలో ఉన్న అచ్యుతాపురం ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)లోని ఎసెన్షియా ఫార్మా పరిశ్రమలో రియాక్టర్ పేలి 17 మంది కార్మికులు మరణించారని, మరో 50 మంది గాయపడ్డారని మీడియాలో వచ్చిన వార్తలను జాతీయ మానవ హక్కుల కమిషన్ (ఎన్‌హెచ్ఆర్‌సీ) సుమోటోగా విచారణకు స్వీకరించింది.

ఈ నెల 21న ఈ కేసును స్వయంగా విచారణకు తీసుకుంది. పేలుడుకు గల కారణాలపై ఇంకా స్పష్టత లేదు. శిథిలాల కింద ఇంకా ఎవరైనా చిక్కుకున్నారేమోనని రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన బృందాలు వెతుకుతున్న ట్లు సమాచారం. శిథిలాల కింద కొన్ని మృతదేహాలు చిక్కుకుపోయి ఉంటాయని, మృతుల సంఖ్య పెరిగే ప్రమాదం ఉందని భావిస్తున్నారు.

పేలుడు జరిగిన సమయంలో ఎంత మంది కార్మికులు విధుల్లో ఉన్నారనే దానిపై స్పష్టత లేదు.

సంబంధిత అధికార్ల నిర్లక్ష్యం కారణంగా బాధితుల 'జీవించే హక్కు' ఉల్లంఘనకు గురైనట్లు మీడియా వార్తల్లోని అంశాలు సూచిస్తున్నాయని జాతీయ కమిషన్ గుర్తించింది. అన్ని భద్రత నియమాలు ఉ చట్టపరమైన నిబంధనలను పరిశ్రమ యజమాన్యం ఖచ్చితంగా పాటించిందా, సంబందిత అధికార్లు పర్యవేక్షిస్తున్నారా, లేదా? అని తనిఖీ చేసేందుకు సమగ్ర దర్యాప్తు చేయాలని ఆదేశిస్తూ ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి, డీజీపీకి నోటీసులు జారీ చేసింది. రెండు వారాల్లో వివరణాత్మక నివేదికను సమర్పించాలని నిర్దేశించింది.

ఎఫ్ఐఆర్ స్థితి, గాయపడిన వారి ఆరోగ్యం ఉ వైద్య చికిత్స, నష్టపరిహారం పంపిణీ, గాయపడిన వారికి ఉ చనిపోయిన కార్మికుల కుటుంబాలకు అందించిన ఇతర ఉపశమనాలపై తాజా సమాచారం అందించాలని ఎన్‌హెచ్ఆర్‌సీ సూచించింది.

దుర్ఘటనకు బాధ్యులైన అధికార్లపై తీసుకున్న చర్యల గురించిన సమాచారాన్ని కూడా జాతీయ కమిషన్ అడిగింది.

## కవితను కలిసిన హరీశ్ రావు, రవిచంద్ర..

హైదరాబాద్, ఆగష్టు 23 :ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టయి తీహార్ జైలులో ఉన్న బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కవితను మాజీ మంత్రి హరీశ్ రావు, వద్దిరాజు రవిచంద్ర కలిశారు. ఇటీవల కవిత అస్వస్థతకు గురయ్యారు. జైలు అధికారులు ఆమెను నిన్న ఢిల్లీలోని ఎయిమ్స్ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స అందించారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీ నేతలు హరీశ్ రావు, వద్దిరాజు రవిచంద్ర తీహార్ జైలుకు వెళ్లి కవితను కలిశారు.

మరోవైపు ఢిల్లీ లిక్కర్ స్కామ్ కేసులో అరెస్టయిన కవిత బెయిల్ కోసం ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఆమె రూస్ అవెన్యూ కోర్టుతో సహా సుప్రీంకోర్టులో బెయిల్ కోసం దరఖాస్తు చేసుకుంది. రూస్ అవెన్యూ కోర్టు ఆమె బెయిల్ పిటిషన్‌లను పలుమార్లు తిరస్కరించింది? కాగా, ప్రస్తుతం ఆమె బెయిల్ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో వాదనలు కొనసాగుతున్నాయి. తదుపరి విచారణ ఈ నెల 27న జరగనుంది.

## మూడు జిల్లాల్లో గవర్నర్ పర్యటన..

హైదరాబాద్, ఆగష్టు 23 :రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ఈనెల 27 నుంచి మూడు రోజులపాటు వరంగల్, యాదాద్రి జిల్లాల్లో పర్యటించనున్నారు. ఆగస్టు 27న యాదాద్రి ఆలయాన్ని దర్శించుకోనున్న ఆయన, అక్కడి నుంచి నేరుగా ములుగు జిల్లాకు వెళ్లి వివిధ రంగాల్లో విశేష ప్రతిభ చూపిన అవార్డు గ్రహీతలతో సమావేశమవుతారు. యునెస్కో గుర్తింపు పొందిన కాకతీయ కళా ఖండం రామప్ప ఆలయాన్ని వీక్షించి లక్నవరంకు వెళ్లనున్నారు.

మరుసటి రోజు హనుమకొండలో పేరొందిన కళాకారులు, ప్రముఖులతో సమావేశం కానున్నారు. అనంతరం వరంగల్ ఖిల్లాను, భద్రకాళీ, వేయిస్తంభాల ఆలయాలను సందర్శిస్తారు. మూడో రోజు జనగామ జిల్లాలో కవులు, కళాకారులతో సమావేశమై అక్కడి నుంచి కొలనుపాకను సందర్శిస్తారు. గవర్నర్ పర్యటనకు నాలుగు జిల్లాల యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేస్తుండగా, పోలీసులు కట్టుదిట్టమైన బందోబస్తు ఏర్పాట్లకు సన్నద్ధమయ్యారు.

ఈనెల 27న కోట గుళ్ళ ను సందర్శించనున్న గవర్నర్..

ఈనెల 27న తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణు దేవ్ వర్మ జయశంకర్ భూపాలపల్లి జిల్లాలోని గణపురం మండల కేంద్రంలో ఉన్న శ్రీ భవానీ సహిత గణపేశ్వరాలయం కోటగుళ్ళ ను సందర్శించనున్నారు. వరంగల్ ఉమ్మడి జిల్లా పర్యటనలో భాగంగా మూడు రోజులపాటు చారిత్రక కట్టడాలను సందర్శించనున్నారు. 27న మధ్యాహ్నం మూడు గంటల నుండి నాలుగు గంటల వరకు ములుగు జిల్లా రామప్ప, జయశంకర్ జిల్లా గణపురం మండలం కోటగుళ్లలో గవర్నర్ పర్యటన కొనసాగనుంది. గవర్నర్ పర్యటనను పురస్కరించుకొని అధికారులు భారీ ఏర్పాట్లు చేస్తున్నారు.

## రూ. 35 వేలు లంచం తీసుకుంటూ ఏసీబీకి పట్టుబడ్డ డీసీటీవో



హైదరాబాద్, ఆగష్టు 23 : నగరంలోని నారాయణగూడ సర్కిల్ పరిధిలో వాణిజ్య పన్నులశాఖ అధికారి వసంతాఇందిర లంచం తీసుకుంటూ ఏసీబీ అధికారులకు రెడ్ హ్యాండెడ్‌గా చిక్కారు. శుక్రవారం సాయంత్రం కార్యాలయంపై దాడి చేసి రూ.35 వేలు లంచం తీసుకున్న డీసీటీవో (డిప్యూటీ కమర్షియల్ టాక్స్ ఆఫీసర్) ను పట్టుకున్నారు.

బాధితుడికి సంబంధించిన అకౌంట్ లావాదేవీల పరిశీలనకు గాను డీసీటీవో వసంత లంచం డిమాండ్ చేసింది. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. శుక్రవారం సాయంత్రం వ్యూహం ప్రకారం బాధితుడి నుంచి లంచం తీసుకుంటుండగా అక్కడే మాటువేసిన ఏసీబీ అధికారులు ఆమెను పట్టుకున్నారు. పట్టుకున్న సొమ్మును ఆమె నుంచి స్వాధీనం చేసుకుని, ఆమెపై అవినీతి కేసు నమోదు చేసి కోర్టులో ప్రవేశపెట్టామని ఏసీబీ అధికారులు వెల్లడించారు. ఎవరైనా ప్రభుత్వ అధికారి, ఉద్యోగి లంచం డిమాండ్ చేస్తే 1064 టోల్ ఫ్రీ నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.

# హైడ్రోజన్ ఇంధనంతో పర్యావరణ పరిరక్షణ !

సాంప్రదాయ తరిగే శిలాజ ఇంధనాలే అధికంగా వాడిన గత చరిత్ర ప్రపంచానిది. శిలాజ ఇంధనాల వినియోగంతో కార్బన్ ఉద్గారాలు పెరిగి పర్యావరణం ప్రమాదంలో పడుతోంది. మహావిపత్తు విజృంభించడానికి పర్యావరణ వినాశనమే ప్రధాన కారణమని తెలుస్తున్నది. శిలాజ ఇంధన ఉద్గారాల్లో కార్బన్ డై ఆక్సైడ్ లాంటి హరిత గృహ వాయువులతో "భూతాపం" శాపంగా మారనుందని ఐరాస సౌజన్య ఐపిసిసి నివేదిక తెలియజేస్తున్నది. నైట్రోజన్ ఆక్సైడ్‌లతో "ఆమ్లవర్షం", వాయు కాలుష్యంతో "ఫోటో-కెమికల్ స్మాగ్(కాంతి రసాయన పొగ)" లాంటి భయానక దుష్ప్రభావాలను అనుభవిస్తున్నాం. తరిగే శిలాజ ఇంధనాలకు ప్రత్యామ్నాయంగా పర్యావరణ హిత తరగని "సాంప్రదాయేతర ఇంధనా"లైన సౌరశక్తి, పవనశక్తి, అలల శక్తి లాంటి రంగాలను ప్రవేశపడుతున్నాం. వాహన ఇంధనంగా విద్యుత్ యంత్రాలను తీసుకువస్తున్నాం. ద్రవ పెట్రోల్, డిజిల్ లాంటి ఇంధనాలకు బదులు స్వల్ప కాలుష్యం కలిగించగల "సియన్‌జి గ్యాన్" వాహనాలను ప్రోత్సహిస్తున్నాం. పర్యావరణంలో కార్బన్ ఉద్గారాలను తగ్గిస్తూ, 2047 నాటికి భారతదేశం ఇంధన స్వావలంభన స్థాయికి ఎదగాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం 'నేషనల్ హైడ్రోజన్ మిషన్' ఏర్పాటు చేస్తున్నామని మన ప్రధాని సగర్వంగా ప్రకటించడం హర్షదాయకం, ఆహ్వానించదగిన పరిణామం.

### భవిష్యత్తు ప్రత్యామ్నాయ హరిత ఇంధనంగా హైడ్రోజన్:

హైడ్రోజన్‌ను భవిష్యత్తు ఇంధనంగా చూస్తున్నాం. హైడ్రోజన్ ఇంధనం మండితే సురక్షిత నీటి అణువులు విడుదల అవుతాయేగాని, ప్రమాదకర కార్బన్ డై ఆక్సైడ్ విడుదల కాకపోవడం ఆహ్వానించదగ్గ పరిణామంగా చెప్పవచ్చు. హైడ్రోజన్ ఒక కిలోతో జనించే శక్తిని 2.8 కిలోల గ్యాసోలిన్ ఉత్పత్తి చేస్తుంది. తయారీ పద్ధతిని బట్టి హైడ్రోజన్ అణువుల్ని బ్లాక్, గ్రీన్, బ్లూ, బ్రౌన్, పింక్, గ్రే, యెల్లో, వైట్ లాంటి రకాలుగా వర్గీకరిస్తారు. హైడ్రోజన్ తయారీలో సాలీన 830 మెట్రిక్ టన్నుల కార్బన్ డై ఆక్సైడ్ విడుదల అవుతుందని, ఇది యుకె / ఇండొనేషియ విడుదల చేసే కార్బన్ ఉద్గారానికి సమానమని గమనించాలి. ఆంథ్రసైట్ అనబడే బ్లాక్ కోల్ లేదా లిగ్నైట్ నుండి తయారు చేయబడిన బ్లాక్, బ్రౌన్ హైడ్రోజన్ ఇంధనంతో పర్యావరణంలోకి అధిక కార్బన్ డై ఆక్సైడ్, కార్బన్ మోనాక్సైడ్, మీథేన్, ఈథేన్ లాంటి కాలుష్యాలు వెలువడుతాయి. నాచురల్ గ్యాస్ నుంచి తయారు చేయబడిన గ్రే హైడ్రోజన్ ఇంధనం కొంత సురక్షితమని తెలుస్తున్నది.

### హరిత హైడ్రోజన్ తయారి:

సురక్షిత పర్యావరణ హిత హరిత హైడ్రోజన్‌ను ప్రారిశ్రామిక పరిమాణంలో ఉత్పత్తి చేయడానికి సులభ మార్గాలను అన్వేషించుట జరుగుతోంది. నీటిని విద్యుద్విశ్లేషణంలో (విద్యుచ్ఛక్తి వినియోగం) సురక్షిత హరిత హైడ్రోజన్‌తో పాటు ఆక్సీజన్ ఏర్పడుతుంది. ప్రపంచంలోనే తొలిసారి హరిత హైడ్రోజన్ వాణిజ్యపరంగా తయారు చేయడానికి రాజస్థాన్‌లో పైలెట్ ప్రాజెక్ట్ ఏర్పాటు చేయడం జరిగింది. అణుశక్తితో నీటి విద్యుద్విశ్లేషణ ప్రక్రియలో పింక్ హైడ్రోజన్, సౌరశక్తితో యెల్లో హైడ్రోజన్ ఏర్పడతాయి. హరిత హైడ్రోజన్ తయారీకి అధిక విద్యుత్ వినియోగం కావడం జరుగుతుంది. మీథేన్ పైరాలిసిస్‌లో విడుదల అయ్యే టార్క్వాయిస్ హైడ్రోజన్ ఘన కార్బన్‌ను మిగుల్చుతుంది. హైడ్రోజన్ వాణిజ్య ఉత్పత్తితో పాటు సరైన యంత్ర టెక్నాలజీని రూపొందించడం కూడా ప్రాధాన్యతను సంతరించుకున్నది.

ప్రపంచవ్యాప్తంగా హరిత హైడ్రోజన్ వినియోగానికి ప్రభుత్వాలు దీర్ఘకాలిక వ్యూహాలు, అవసర పెట్టుబడులు, ధర తగ్గించే ప్రక్రియలు రూపొందించడానికి 'ఆర్ అండ్ డి'కి చేయూత, వాణిజ్య ఉత్పత్తి మార్గాలు లాంటి చర్యలు వెంటనే తీసుకోవాలి. హరిత హైడ్రోజన్ లభ్యత వాణిజ్యపరంగా సరసమైన ధరలకు అందుబాటులోకి వస్తే భవిష్యత్తు ఇంధనంగా హైడ్రోజన్ నిలుస్తుందనడం అతిశయోక్తి లేదు.

- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి,
99497 00037

# మరకలను కాదు..మెరుపులను చూడాలి

## -కవుల లోపాలను తూచకూడదు -డా.కాంచనపల్లి గోవర్ధన్ రాజు




హైదరాబాద్, ఆగష్టు 22 :కవుల పుస్తకాలకు రాసే ముందు మాటలు కవులను ప్రోత్సహించేలా ఉండాలని,కవుల లోపాలను తూచకూడదని,సినారె చెప్పినట్లు మరకలను కాదు మెరువులను చూడాలని పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార గ్రహీత డాక్టర్ కాంచనపల్లి గోవర్ధన్ రాజు అన్నారు. కరీంనగర్ కు చెందిన కవి రచయిత విమర్శకులు వైరాగ్యం ప్రభాకర్ రాసిన భూమిక ఆధునిక సాహిత్య విమర్శ వ్యాస సంపుటిని కరీంనగర్ లోని వాగేశ్వరి డిగ్రీ కళాశాలలో జరిగిన పుస్తకావిష్కరణ సభకు ముఖ్యఅతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కవిలోని గొప్పదనాన్ని, సహృదయతను ప్రదర్శించేలా మనోరంజకమైన వర్ణనలతో వ్యాసాలున్నాయని అన్నారు.తెలంగాణ రచయితల వేదిక అధ్యక్షులు సి.వి.కుమార్ అధ్యక్షతన భవానీ సాహిత్య వేదిక సంస్థ తరపున జరిగిన సభకు విశిష్ట అతిథిగా హాజరైన కవి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల లక్సెట్టిపేట్ తన్నీరు సురేష్ మాట్లాడుతూ ముందు మాటలు ప్రేరణ కలిగించేవిగా,పాఠకులను పుస్తక పఠనం వైపు మరల్చేవిగా ఉండాలని అన్నారు.ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ కథా రచయిత పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం సాహితీ పురస్కార గ్రహీత బి.వి.యన్.స్వామి మాట్లాడుతూ ముందు మాటలు, సమీక్షలు కవిని ప్రోత్సహించేలా, ఆప్తవాక్యంలా ఉండాలని అన్నారు.ప్రధాన వక్తగా హాజరైన ప్రముఖ కవి , ఉపాధ్యాయులు లేదాళ్ళ రాజేశ్వర రావు పుస్తకాన్ని పరిచయం చేయగా వర్ధమాన కవి తడిగొప్పుల కుమారస్వామి ఆహ్వానం పలికారు. కార్యక్రమంలో కవి, గాయకులు చిలుక రాజలింగం, బొమ్మకంటి కిషన్,గంప ఉమాపతి, సంకెపల్లి నాగేంద్రశర్మ, విలాసాగరం రవీందర్,కొత్త అనిల్ కుమార్, కట్ట శ్యామ్,జనగాని యుగంధర్,మఠం సాంబమూర్తి,నడిమెట్ల రామయ్య, పాక రాంమోహన్,కాడె శంకరయ్య, వెల్ముల జయపాల్ రెడ్డి,నలుమాసు విజయ ప్రసాద్, కోరంకంటి శశికిరణ్మయి,విజయశ్రీ,కసిరెడ్డి జలంధర్ రెడ్డి, సింగిరెడ్డి రాజిరెడ్డి ,రవీంద్రాచారి తదితరులు పాల్గొన్నారు.

# సంక్షోభ సమయంలో త్రిపురలోని మన సోదర సోదరీమణులకు మోదీ ప్రభుత్వం అండగా నిలుస్తుంది : అమిత్ షా

న్యూఢిల్లీ, ఆగష్టు 23:కేంద్ర హోం, సహకార శాఖ మంత్రి శ్రీ అమిత్ షా త్రిపుర ముఖ్యమంత్రి డాక్టర్ మాణిక్ సాహాతో మాట్లాడి రాష్ట్రంలో వరద పరిస్థితిని సమీక్షించారు.

ఈ మేరకు "ఎక్స్" లో మంత్రి ఈ విధంగా పోస్ట్ చేశారు, "త్రిపుర సీఎండాక్టర్ మాణిక్ సాహాతో మాట్లాడి రాష్ట్రంలో వరద పరిస్థితి గురించి తెలుసుకున్నాను. సహాయక చర్యల్లో స్థానిక ప్రభుత్వానికి సహకరించేందుకు కేంద్రం పడవలు, హెలికాప్టర్లతో పాటు ఎన్డీఆర్ఎఫ్ బృందాలను రాష్ట్రానికి పంపుతోంది. అవసరమైనప్పుడు కేంద్రం నుంచి అన్ని విధాలా సహకరిస్తామని హామీ ఇచ్చాను.

ఈ సంక్షోభ సమయంలో త్రిపురలోని మన సోదరీమణులు, సోదరులకు మోదీ ప్రభుత్వం అండగా నిలుస్తుంది" అని అన్నారు.

# విజయవాడలోని సిజిఓ కాంప్లెక్స్‌లో 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టిన పీఐబీ



న్యూఢిల్లీ, ఆగష్టు 23:ఆగస్టు 15, 2024న 78వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపు మేరకు సమాచార మరియు ప్రసార మంత్రిత్వ శాఖ ఆధ్వర్యంలోని విజయవాడ పత్రికా సమాచార కార్యాలయం 'ఏక్ పేడ్ మా కే నామ్' (తల్లి పేరు మీద ఒక చెట్టు నాటడం) ప్రచారంలో భాగంగా మొక్కలు నాటే కార్యక్రమాన్ని చేపట్టింది. దేశవ్యాప్తంగా అటవీ విస్తీర్ణం పెంచడం కోసం ఉద్దేశించిన ఈ డ్రైవ్ మార్చి 2025 వరకు కొనసాగుతుంది.

ప్రధానమంత్రి శ్రీ నరేంద్ర మోదీ జూన్ 5, 2024న పర్యావరణ దినోత్సవం సందర్భంగా 'ఏక్ పేడ్ మా కే నామ్' ప్రచారాన్ని ప్రారంభించి, భారతదేశం మరియు ప్రపంచవ్యాప్తంగా ఉన్న ప్రతిఒక్కరూ వారి తల్లికి ప్రశంసగా ఒక చెట్టుని నాటాలని కోరారు.పత్రికా సమాచార కార్యాలయం మరియు కేంద్ర సమాచార కార్యాల యం అదనపు డైరెక్టర్ జనరల్ (ఆంధ్రా ప్రాంతం) శ్రీ రాజిందర్ చౌదరి ఈ ప్రచారంలో పాల్గొని ఒక మొక్కని నాటారు. పత్రికా సమాచార కార్యాలయం మరియు కేంద్ర సమాచార కార్యాలయం అధికారులు మరియు సిబ్బంది ప్రకృతిని రక్షించే నిమిత్తం మరియు పర్యావరణ పరిరక్షణ కోసం ఉద్యమాన్ని మరింత ప్రభావవంతంగా మరియు చైతన్యవంతం చేయడంలో చురుగ్గా సహకరించాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ చిన్న పని వాతావరణ మార్పులతో పోరాడేందుకు, కాలుష్యాన్ని తగ్గించేందుకు మరియు మన పరిసరాలను పచ్చగా మార్చేందుకు బాగా సహాయపడుతుందని ఆయన అన్నారు.

# 4.3 లక్షల స్వయం సహాయక సంఘాల్లోని 48 లక్షల మందికి ప్రయోజనం: శ్రీ చౌహాన్

న్యూఢిల్లీ, ఆగష్టు 23:కేంద్ర గ్రామీణాభివృద్ధి, వ్యవసాయం, రైతు సంక్షేమ శాఖ మంత్రి శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ ఈరోజు న్యూఢిల్లీలో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా 2024, ఆగస్ట్ 25న మహారాష్ట్రలోని జల్గావ్‌లో ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ పాల్గొననున్న కార్యక్రమం గురించి మంత్రి వివరించారు. ఈ మీడియా సమావేశానికి కేంద్ర సహాయ మంత్రి శ్రీ చంద్ర శేఖర్ పెమ్మసాని కూడా హాజరయ్యారు. ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ లఖ్‌పతి దీదీలతో మాట్లాడడంతోపాటు, 11 లక్షల మంది కొత్త లఖ్‌పతి దీదీలకు ధ్రువీకరణ పత్రాలు అందజేస్తారని శ్రీ చౌహాన్ తెలిపారు.

ఈ కార్యక్రమంలో ప్రధానమంత్రి రూ. 2500 కోట్ల రివాల్వింగ్ ఫండ్ - కమ్యూనిటీ ఇన్ వెస్ట్ మెంట్ ఫండ్ విడుదల చేస్తారన్నారు. దీని ద్వారా 4.3 లక్షల స్వయం సహాయక బృందాలకు (ఎస్‌హెచ్‌జిలకు) చెందిన 48 లక్షల మందికి ప్రయోజనం చేకూరుతుందని మంత్రి వివరించారు. 2,35,400 స్వయం సహాయక బృందాల్లోని (ఎస్‌హెచ్‌జిల్లోని) 25.8 లక్షల మందికి ప్రయోజనం చేకూర్చే రూ. 5000 కోట్ల బ్యాంకు రుణాన్ని కూడా ప్రధాని విడుదల చేస్తారని పేర్కొన్నారు. 34 రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాలు అంటే అంటే దేశవ్యాప్తంగా ఉన్న రాష్ట్ర రాజధానులు, జిల్లా ప్రధాన కార్యాలయాలు, సిఎల్ఎఫ్‌ల నుండి సుమారు 30,000 ప్రాంతాలకు చెందిన మహిళలు వర్చువల్ మాధ్యమం ద్వారా ఈ కార్యక్రమంలో పాల్గొనున్నట్లు శ్రీ చౌహాన్ తెలిపారు.

లఖ్‌పతి దీదీలు సంవత్సరానికి రూ. 1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ సంపాదిస్తున్న మహిళలు అని శ్రీ శివరాజ్ సింగ్ చౌహాన్ చెప్పారు. ఈ లఖ్‌పతి దీదీలు తమ కుటుంబాలను పేదరికం నుండి బయటపడేయడమే కాకుండా మిగిలిన సమాజానికి ఆదర్శంగా నిలుస్తున్నారని కొనియాడారు. గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఇప్పటికే కోటి మంది లఖ్‌పతి దీదీలను తయారు చేసినట్లు శ్రీ చౌహాన్ తెలియజేశారు. రాబోయే 3 సంవత్సరాలలో 3 కోట్ల మంది లఖ్‌పతి దీదీలను తయారుచేయడమే తమ లక్ష్యమని మంత్రి స్పష్టం చేశారు. ఈ సిఆర్‌పిలలో ఒకరు 95 మంది లఖ్‌పతి దీదీలను తయారుచేయడం హర్షణీయమన్నారు.

ఎస్‌హెచ్‌జి కుటుంబాలు రూ. 1 లక్ష లేదా అంతకంటే ఎక్కువ వార్షిక ఆదాయాన్ని సంపాదించేందుకు వీలుగా ఒక నిర్మాణాత్మక ప్రక్రియను మంత్రిత్వ శాఖ అనుసరించిందని కేంద్ర మంత్రి తెలిపారు. ఇందులో భాగంగా సమర్థులైన నేషనల్ రిసోర్స్ పర్సన్‌లను సన్నద్ధం చేసి, ఆపై ప్రతి రాష్ట్రంలో మాస్టర్ ట్రైనర్‌లను సిద్ధం చేసినట్లు మంత్రి వివరించారు. ఈ మాస్టర్ ట్రైనర్‌లు వ్యాపార ప్రణాళిక, ఫైనాన్సింగ్ అలాగే కన్వర్జెన్స్ ప్రక్రియల గురించి కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్‌లకు (సిఆర్‌పిలు) మరింత శిక్షణ ఇస్తారని తెలిపారు. వ్యాపార ప్రణాళిక, ఎస్‌హెచ్‌జి సభ్యుల నైపుణ్యాభివృద్ధి గురించి 3 లక్షల మంది కమ్యూనిటీ రిసోర్స్ పర్సన్స్ (సిఆర్‌పిలు) ప్రత్యేకంగా శిక్షణ పొందారని, వారి బృందం ఈ విషయంలో గొప్ప సేవ చేస్తున్నదని మంత్రి కితాబిచ్చారు. వీరిలో కొందరిని ఈ కార్యక్రమంలో భాగంగా సన్మానించనున్నట్లు మంత్రి తెలిపారు. 100 రోజుల్లో 11 లక్షల మందిని లఖ్‌పతి దీదీలుగా మార్చే లక్ష్యంలో భాగంగా ఇప్పటి వరకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ఏకంగా 15 లక్షల మంది లఖ్‌పతి దీదీలను తయారు చేసిందని మంత్రి వివరించారు. వీరిలో 11లక్షల మంది లఖ్‌పతి దీదీలను ప్రధానమంత్రి సత్కరించనున్నట్లు మంత్రి తెలిపారు.

# 'వేవ్స్' నిర్వహణ నేపథ్యంలో "క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్- సీజన్ 1" కింద 25 అంశాల్లో పోటీలకు కేంద్ర సమాచార-ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వినీ వైష్ణవ్ శ్రీకారం




న్యూఢిల్లీ, ఆగష్టు 23: ప్రపంచ దృశ్య-శ్రవణ/వినోద సదస్సు (వేవ్స్) నిర్వహణ నేపథ్యంలో 'క్రియేట్ ఇన్ ఇండియా ఛాలెంజ్- సీజన్ 1'లో భాగంగా 25 అంశాల్లో పోటీలను కేంద్ర సమాచార-ప్రసార శాఖ మంత్రి శ్రీ అశ్వనీ వైష్ణవ్ ఇవాళ ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ- శరవేగంగా పురోగమిస్తూ వృద్ధి పథంలో పయనిస్తున్న మన ఆర్థిక వ్యవస్థను ఈ పోటీలు ప్రతిబింబిస్తాయని ఆయన వ్యాఖ్యానించారు. ఈ రూపంలో పూర్తిస్థాయి నవ్య సృష్టికర్తల ఆర్థిక వ్యవస్థ ఊపిరి పోసుకున్నదని శ్రీ వైష్ణవ్ పేర్కొన్నారు. ఈ ఏడాది మార్చిలో సృష్టికర్తల తొట్టతొలి జాతీయ పురస్కార ప్రదానోత్సవం సందర్భంగా ప్రకటించిన మేరకు దీనికి ప్రధానమంత్రి గుర్తింపు కూడా లభించిందని గుర్తుచేశారు.

**సృష్టికర్తల ఆర్థిక వ్యవస్థ ఎదుగుదల: అవకాశాలు.. మౌలిక సదుపాయాలు.. ఉద్యోగ సృష్టి**

మన సుసంపన్న సాంస్కృతిక వారసత్వం.. జీవన విధానాల చిత్రణకు ఈ సరికొత్త ఆర్థిక వ్యవస్థ ఒక అద్భుత ఉపకరణమని, దీనికి అపార సామర్థ్యం ఉందని కేంద్ర మంత్రి నొక్కిచెప్పారు.

సంప్రదాయ వైద్య విధానాలు, యోగా, మన వంటకాల వైవిధ్యం ప్రదర్శించడంలూ ఇదొక సృజనాత్మక సాధనమని పేర్కొన్నారు. ఈ ఆర్థిక వ్యవస్థను ప్రోత్సహించే దిశగా కేంద్ర ప్రభుత్వం ప్రతి అవకాశాన్నీ సద్వినియోగం చేసుకుంటున్నదని వివరించారు. అందువల్ల ఈ రంగంలో ప్రతిభ, నైపుణ్యాభివృద్ధి, అవసరమైన మౌలిక సదుపాయాల లభ్యతకు భరోసా ఇవ్వాల్సి ఉందని కేంద్ర మంత్రి అన్నారు.

సృష్టికర్తల ఆర్థిక వ్యవస్థలో మరింత వృద్ధి సాధించే దిశగా అంతర్జాతీయ ప్రతిభా వికాస కార్యక్రమాల నిర్వహణతోపాటు మౌలిక సదుపాయాల కల్పనపై ప్రభుత్వం దృష్టి సారించిందని చెప్పారు. మీడియా-వినోద రంగంలో సృష్టికర్తల సామర్థ్యం పెంపు లక్ష్యంగా ప్రపంచ స్థాయి విశ్వవిద్యాలయాల ఏర్పాటుసహా సౌకర్యాల కల్పనకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్లు వెల్లడించారు.

**చలనచిత్ర నిర్మాణంలో నవ్య సాంకేతికతల వినియోగం: ఉపాధి సృష్టి**

భారతదేశ బలాల్లో చలనచిత్ర నిర్మాణం కూడా ఒకటని శ్రీ అశ్వనీ వైష్ణవ్ స్పష్టం చేశారు. ప్రస్తుత ఆధునిక యుగంలో కొత్త సాంకేతికత-ఉపకరణాల వినియోగ పరిధి ఈ రంగంలో విస్తృతంగా ఉంటుందని, తద్వారా అపార ఉపాధి అవకాశాలు అందివస్తాయని ఆయన పేర్కొన్నారు. తదనుగుణంగా ఈ కార్యక్రమాన్ని విజయవంతంగా నిర్వహిస్తే దాదాపు 2-3 లక్షల కొత్త ఉపాధి అవకాశాలను సృష్టించవచ్చని అంచనా వేశారు.

### సామాజిక బాధ్యత

అయితే, ఈ పురోగమనంలో మన సమాజానికి ఎలాంటి హాని కలగకుండా జాగ్రత్త వహించాలని అప్రమత్తం చేశారు. ఇది కేవలం ప్రభుత్వ కర్తవ్యం మాత్రమే కాదని, పరిశ్రమ, యావత్ సమాజంతోపాటు మనందరిపైనా సమష్టి బాధ్యత ఉందని కేంద్ర మంత్రి హెచ్చరించారు.

ఈ రంగంలోని అపార సామర్థ్య సద్వినియోగంలో భాగంగానే 'వేవ్స్' నిర్వహణ బాధ్యతలు చేపట్టామని, భవిష్యత్తులో ఇదొక అసాధారణ నవలోకంగా ఆవిర్భవిస్తుందని ఆయన అన్నారు.

ఈ కార్యక్రమంలో పాల్గొన్న ప్రముఖులలో- సమాచార-ప్రసార మంత్రిత్వశాఖ కార్యదర్శి శ్రీ సంజయ్ జాజు, అదనపు కార్యదర్శి శ్రీమతి నీరజా శేఖర్, 'ఫిక్కి' డైరెక్టర్ జనరల్ శ్రీమతి జ్యోతి విజ్, మీడియా అండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌పై 'సిఐఐ' జాతీయ కమిటీ ఉపాధ్యక్షులు శ్రీ బీరెన్ ఘోష్ తదితరులున్నారు.

**'డిజైన్ ఇన్ ఇండియా-డిజైన్ ఫర్ ది వరల్డ్'**

ఈ సందర్భంగా శ్రీ సంజయ్ జాజు ప్రసంగిస్తూ- భారత సృజనాత్మక పర్యావరణ వ్యవస్థ వృద్ధి/ఉన్నతీకరణ దిశగా కొనసాగుతున్న కృషిలో ఈ కార్యక్రమం ఓ కీలక మైలురాయిగా నిలుస్తుందని పేర్కొన్నారు. "దేశ 78వ స్వాతంత్ర్య దినోత్సవం నాటి తన ప్రసంగంలో ప్రధానమంత్రి ప్రకటించిన 'భారత్‌లో డిజైనింగ్-ప్రపంచం కోసం డిజైనింగ్' దార్శనికతను ఇది స్పష్టంగా ప్రతిబింబిస్తుంది'' అని వ్యాఖ్యానించారు.

మన దేశంలోగల అపార ప్రతిభాసామర్థ్యాలను 'వేవ్స్' ప్రపంచానికి రుజువు చేస్తుందని ఆత్మవిశ్వాసం వ్యక్తం చేశారు. అలాగే ప్రపంచవ్యాప్తంగాగల అత్యంత మేధావులు, ప్రతిభావంతులైన సృష్టికర్తలకు ఇది వేదిక కాగలదన్నారు. దీంతోపాటు ప్రపంచం నలుమూలల నుంచి హాజరయ్యే దార్శనిక నాయకులు తమ విజ్ఞానాన్ని అందరితోనూ పంచుకునే అంతర్జాతీయ వేదికగానూ ఉపయోగపడుతుందని చెప్పారు. ఆ మేరకు ఆలోచనల ఆదానప్రదానంతో సృజనాత్మకత హద్దులను చెరిపివేస్తుందని పేర్కొన్నారు.

# చంద్రయాన్ తో భారతదేశం

## అగ్రదేశాల సరసన నిలిచింది -డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి...



హైదరాబాద్, ఆగష్టు 23 :ఈరోజు జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా స్థానిక ప్రభుత్వ ఉన్నత పాఠశాల సప్తగిరి కాలనీ యందు నిర్వహించిన వివిధ కార్యక్రమాలకు ముఖ్యఅతిథిగా విచ్చేసిన ప్రముఖ మోటివేషనల్ స్పీకర్ మరియు ఎస్ ఆర్ ఆర్ ప్రభుత్వ డిగ్రీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు ×కెప్టెన్ డాక్టర్ బుర్ర మధుసూదన్ రెడ్డి గారు విద్యార్థులనుద్దేశించి మాట్లాడుతూ గత సంవత్సరం భారత ప్రభుత్వం మరియు ఇస్రో చేపట్టిన చంద్రయాన్ ప్రయోగం విజయవంతం అవడంతో మన దేశం అగ్రదేశాల సరసన నిలిచిందని అంతరిక్ష ప్రయోగాలు విజయవంతం అవుతుండడం భారతదేశ అభివృద్ధికి చిహ్నామని ఒకప్పుడు రాకెట్ ప్రయోగానికి రాకెట్లను సైకిల్ పై తీసుకెళ్లిన స్థాయి నుండి నేడు రోదసిలోనే మన దేశ జెండాను నిలిపేస్తాయికి ఎదిగిన ఘన చరిత్ర ఇస్రోదని, ఇది మన దేశం సాధించిన గొప్ప ప్రగతి అని వారు పేర్కొన్నారు. భారతదేశం నేడు అంతరిక్ష రంగంలో రాకెట్ అంత స్పీడుగా దూసుకెళ్తుందని ఇవాళ మనం అనుభవిస్తున్న ఈ అధునాతన మొబైల్ టెక్నాలజీ వంటి ఎన్నో ఆధునిక టెక్నాలజీలకు భారతదేశ అంతరిక్ష రంగం సాధించిన ప్రగతేనని అద్భుత విజయాలను మూటగట్టుకున్న ఇస్రోకు మనమంతా కృతజ్ఞులమై ఉండాలని వారు సూచించారు..నేడు కేంద్ర ప్రభుత్వం అంతరిక్ష పరిశోధనలకు అధిక ప్రాధాన్యతనిస్తూ గొప్ప పరిశోధనలకు ప్రోత్సహిస్తుందని దానిని ఇస్రో అందిపుచ్చుకొని ముందుకు వెళుతుందని ఈ సందర్భంగా వారు కొనియాడారు. తదనంతరం ఈరోజు పాఠశాలలో అంతరిక్ష దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించిన డ్రాయింగ్ పోటీలలో మరియు క్విజ్ పోటీలలో గెలుపొందిన విద్యార్థులకు బహుమతి ప్రధానం చేయడం జరిగింది.

పాఠశాల ప్రధానోపాధ్యాయులు శ్రీ ఎం.రాజేందర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు గాజుల రవీందర్, ఉమామల్లేశ్వరి, ఎం.అన్నపూర్ణ, సిహెచ్. శ్రీనివాస్ , సత్యనారాయణరావు, రామారావు, అపోలీనవెస్లీ, పద్మజ, ఏ.శంకరయ్య, బి.భారతి, జి.ప్రసాద్ రావు, ఏ.ప్రవీల, జి.విజయలక్ష్మి, మంజూరున్నీసా షబానా, ఏ.మమత,యం.ఆర్వి.ప్రసాద్, ఇ.రాజేశ్వరి, సంసుద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

# పద్మ పురస్కారాలు -2025 నామినేషన్లకు చివరి తేదీ సెప్టెంబర్ 15

న్యూఢిల్లీ, ఆగష్టు 23:గణతంత్ర దినోత్సవం సందర్భంగా ప్రకటించే పద్మ పురస్కారాలు ? 2025కు నామినేషన్లు/సిఫార్సులు ఈ ఏడాది మే ఒకటో తేదీన ప్రారంభమయ్యాయి. ఈ పురస్కారాల నామినేషన్లకు గడువు సెప్టెంబర్ 15వ తేదీతో ముగుస్తోంది. రాష్ట్రీయ పురస్కార పోర్టల్ https://awards.gov.in) ద్వారా నామినేషన్లు/సిఫార్సులను స్వీకరిస్తారు.

పద్మ విభూషణ్, పద్మభూషణ్, పద్మశ్రీ పురస్కారాలు దేశంలోనే అత్యున్నత పౌరపురస్కారాలు. 1954 నుంచి గణతంత్ర దినోత్సవ సందర్భంలో ప్రతి ఏటా ఈ పురస్కారాలను ప్రకటిస్తున్నారు. కళలు, సాహిత్యం, విద్య, క్రీడలు, వైద్యరంగం, సామాజిక సేవ, సైన్స్ అండ్ ఇంజనీరింగ్, ప్రజావ్యవహారాలు, ప్రజాసేవ, వ్యాపారం, పారిశ్రామికం తదితర రంగాలు/విభాగాల్లో అత్యుత్తమ సేవలు అందించిన వారికి గుర్తింపుగా ఈ పురస్కార ప్రదానం చేస్తారు. జాతి, వృత్తి, స్థాయి, లింగ వివక్ష లేకుండా అందరూ ఈ పురస్కారం స్వీకరించడానికి అర్హులే. ప్రభుత్వ రంగంలో పనిచేసే వైద్యులు, శాస్త్రవేత్తలు మినహా మిగిలిన ప్రభుత్వ ఉద్యోగులు పద్మ పురస్కారాలకు అనర్హులు.

పద్మ పురస్కారాలను "ప్రజల పద్మ"గా మార్చేందుకు ప్రభుత్వం కృతనిశ్చయంతో ఉంది. అందుకే అర్హులైన వారిని నామినేట్ చేయాల్సిందిగా ప్రజలకు విజ్ఞప్తి చేసింది. మహిళలు, బలహీన వర్గాలకు చెందిన వారు, ఎస్సీ, ఎస్టీలు, దివ్యాంగుల్లో నిస్వార్థంగా సమాజ సేవ చేస్తున్నవారిని గుర్తించేందుకు కృషి చేయాల్సిన అవసరం ఉంది.

పైన పేర్కొన్న పోర్టల్ లో సూచించిన విధానంలో నామినేషన్/సిఫార్సు చేయాలనుకున్న వ్యక్తి వివరాలతో పాటుగా 800 పదాలకు మించకుండా ఆ వ్యక్తి విశిష్టతను, సంబంధిత రంగం/విభాగంలో సాధించిన విజయాలు/సేవను స్పష్టంగా వివరించాలికేంద్ర హోంమంత్రిత్వ వ్యవహా రాల వెబ్సైట్ (https://mha.gov.in) లో "అవార్డ్స్ అండ్ మెడల్స్'' శీర్షిక కింద, పద్మ పురస్కారాల పోర్టల్ (https://padmaawards.gov.in )లోనూ ఈ వివరాలు అందుబాటులో ఉంటాయి. ఈ పురస్కారాలకు సంబంధించిన నిబంధనలు, నియవ వాలు https://padmaa ward s.gov.in/AboutAwards.aspx లింక్ లో ఉన్నాయి.

# ఆర్ఆర్బీ శాఖల ద్వారా క్రియాశీల విస్తరణ ఆవశ్యకతను ప్రస్తావించిన శ్రీమతి సీతారామన్




న్యూఢిల్లీ, ఆగష్టు 23:గుజరాత్, మహారాష్ట్ర, మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, రాజస్థాన్ రాష్ట్రాల్లోని తొమ్మిది ప్రాంతీయ గ్రామీణ బ్యాంకు(ఆర్ఆర్‌బి)ల పనితీరును సమీక్షించడానికి కేంద్ర ఆర్థిక, కార్పొరేట్ వ్యవహారాల మంత్రి శ్రీమతి నిర్మలా సీతారామన్ ఈ రోజు ఉదయపూర్‌లో సమావేశమయ్యారు. డిపార్ట్ మెంట్ ఆఫ్ ఫైనాన్షియల్ సర్వీసెస్ (డిఎఫ్ఎస్) కార్యదర్శి శ్రీ ఎం. నాగరాజు, అదనపు కార్యదర్శి, ఇతర సీనియర్ డిఎఫ్ఎస్ అధికారులు, ఆర్ఆర్బీల ఛైర్మన్లు, స్పాన్సర్ బ్యాంకుల సీఈఓలు, ఆర్బీఐ, సిడ్బి, నాబార్డ్ ప్రతినిధులు, 5 రాష్ట్రాల సీనియర్ అధికారులు కూడా ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.

వ్యాపార పనితీరు, డిజిటల్ టెక్నాలజీ సేవలను అప్‌గ్రేడ్ చేయడం, ఎంఎస్ఎంఈ క్లస్టర్లలో వ్యాపార వృద్ధి, గ్రామీణ ప్రాంతాల్లో ఆర్థిక చేరికలను మరింతగా పెంచడంపై సమీక్షా సమావేశంలో దృష్టి సారించారు.

గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు మద్దతు ఇవ్వడంలో ఆర్ఆర్బీల కీలక పాత్రను దృష్టిలో ఉంచుకుని, కేంద్ర ఆర్థిక మంత్రి ఆర్ఆర్బీలు ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించాలని, ముఖ్యంగా ఆకాంక్ష జిల్లాల్లో అవగాహన కల్పించాలని కోరారు.

శ్రీమతి సీతారామన్ బుందేల్‌ఖండ్ ప్రాంతంలో ముద్ర పథకం గణనీయ లక్ష్యాలు సాధించకపోవడాన్ని ప్రస్తావిస్తూ, ఆ ప్రాంతంలోను, ఆకాంక్ష జిల్లాల్లోనూ ఇతర ఆర్థిక చేరిక పథకాలతో పాటు ముద్రా పథకం పనితీరును మెరుగుపరచడానికి రాష్ట్ర ప్రభుత్వ అధికారులు, స్పాన్సర్ బ్యాంకులు, ఆర్ఆర్బీలతో నిర్దిష్ట సమావేశాలు నిర్వహించాలని రాష్ట్ర స్థాయి బ్యాంకర్ల కమిటీ (ఎస్ఎల్బిసి)ని ఆదేశించారు.

గుజరాత్, రాజస్థాన్ రాష్ట్రాల్లో ప్రధానమంత్రి సూర్య ఘర్ ముఫ్త్ బిజిలీ యోజన పథకం సహజ సామర్థ్యాన్ని కేంద్ర ఆర్థిక మంత్రి గుర్తించారు. ఈ పథకం కింద అవగాహన కల్పించి, రుణాన్ని అందించాలని ఆర్ఆర్బీలను కోరారు. ఆర్ఆర్బీల ద్వారా రుణసేవలను విస్తృత స్థాయికి పెంచడానికి 'వన్ డిస్ట్రిక్ట్ వన్ ప్రొడక్ట్' (ఓడిఓపి) కార్యక్రమ సంభావ్యతను కూడా ప్రముఖంగా ప్రస్తావించారు. అదేవిధంగా, ఆర్ఆర్బీలు ప్రధానమంత్రి విశ్వకర్మ పథకం కింద వర్తక వ్యాపారాల్లో రుణాలు అందించడానికి అవకాశాలను గుర్తించాలని ఆమె ఆదేశించారు. ఆర్ఆర్బీలు వ్యవసాయ రుణ పంపిణీలో తమ వాటాను పెంచుకోవాలని, ప్రాధాన్యతా రంగ రుణాల లక్ష్యాలను సాధించాలని కూడా సూచించారు.

ఆర్ఆర్బీల కన్సాలిడేటెడ్ క్యాపిటల్ టు రిస్క్ (వెయిటెడ్) అసెట్స్ రేషియో (సిఆర్ఏఆర్) 2021 ఆర్థిక సంవత్సరంలో 7.8 శాతం నుండి 2024లో 13.7 శాతానికి పెరిగింది. 2021 ఆర్థిక సంవత్సరంలో రూ.41 కోట్ల నష్టాల నుండి 2024లో రూ.2,018 కోట్లు నికర లాభానికి వచ్చింది. స్థూల నిరర్థక ఆస్తులు (జిఎన్పిఏ) 3.9 శాతం నిష్పత్తితో సాపేక్షంగా తక్కువగా ఉన్నాయి. సాధారణ సమీక్ష ప్రారంభమైన సంవత్సరం 2022 నుండి పశ్చిమ మధ్య ప్రాంతంలోని తొమ్మిది ఆర్ఆర్బీలు టెక్నాలజీ అప్‌గ్రేడేషన్‌లో కనిపించిన సంతృప్తికరమైన మెరుగుదలని శ్రీమతి సీతారామన్ గుర్తించారు. ఆర్ఆర్బీలు భవిష్యత్తులో కూడా ఇదే జోరును కొనసాగించాలని కోరారు.

ఆర్ఆర్బీలు మరింత క్రెడిట్‌ని వ్యాప్తి చేయడానికి వారి ఆరోగ్యకరమైన 'సిఏఎస్ఏ' నిష్పత్తిని ఉపయోగించుకోవాలని కేంద్ర ఆర్థిక మంత్రి ఆదేశించారు. ప్రభుత్వం, స్పాన్సర్ బ్యాంకులు తీసుకుంటున్న ప్రయత్నాలే కాకుండా, రాష్ట్ర ప్రభుత్వాల నుండి ఆర్ఆర్బీలకు పెండింగ్‌లో ఉన్న బకాయిలను పరిష్కరించడంలో ఆర్బీఐ జోక్యం చేసుకోవాలని కోరారు.

సమీక్షా సమావేశంలో, ఆర్థిక మంత్రి ఆర్ఆర్బీలను మరింత కస్టమర్ ఫ్రెండ్లీగా మార్చాలని, పనితీరును మరింత మెరుగుపరచడానికి దాని స్థానిక సంబంధాలను మరింత మెరుగుపర్చుకోవాలని ఆదేశించారు. సాంకేతిక సహాయాన్ని అందించడం, ఉత్తమ విధానాలను పంచుకోవడం, ఆర్ఆర్బీలు విజయవంతం కావడానికి అవసరమైన వనరులకు ప్రాప్యత కలిగి ఉండేలా చూసుకోవడం ద్వారా స్పాన్సర్ బ్యాంకులు ఈ ప్రయత్నాలలో ముఖ్యమైన పాత్ర పోషించాలన్నారు.

చిన్న, సూక్ష్మ సంస్థలకు క్రెడిట్‌ని నిర్ధారించడానికి ఎంఎస్ఎంఈ క్లస్టర్‌లలో ఉన్న ఆర్ఆర్బీ శాఖల ద్వారా క్రియాశీల విస్తరణను సీతారామన్ ప్రస్తావించారు. అన్ని ఆర్ఆర్బీలు క్లస్టర్ కార్యకలాపాలకు అనుగుణంగా ఎంఎస్ఎంఈ ఉత్పత్తులను రూపొందించాయి. అయితే, వారు ఆ విభాగంలో తమ క్రెడిట్ పోర్ట్ ఫోలియోను క్రమం తప్పకుండా సమీక్షించుకోవాలని తెలిపారు.

స్పాన్సర్ బ్యాంక్‌లు, ఆర్ఆర్బీలు మున్ముందు ఎదురయ్యే సవాళ్లను తప్పనిసరిగా గుర్తించాలని, ముఖ్యంగా ఆస్తుల నాణ్యతను కొనసాగించడం, డిజిటల్ సేవలను విస్తరించడంతో పాటు పటిష్టమైన కార్పొరేట్ గవర్నెన్స్ పై దృష్టి సారించాలని కేంద్ర ఆర్థిక మంత్రి సూచించారు.

# పల్లెలే దేశానికి పట్టుగొమ్మలు.. మంత్రి అచ్చెన్నాయుడు



శ్రీకాకుళం, ఆగష్టు 23 : గ్రామ పంచాయతీలే దేశానికి పట్టుగొమ్మలని, వాటి అభివృద్దే ధ్యేయంగా స్వర్ణ గ్రామసభల పేరుతో జిల్లాల్లో 912 పంచాయతీల్లో ఒకే రోజు గ్రామ సదస్సులు నిర్వహించి ఉపాధి హామీ పనుల ద్వారా చేపట్టాల్సిన అభివృధి పై ప్రజలతో తీర్మానాలు చేయిసున్నామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. డ్రెయిన్ లేని, సిమెంట్ రోడ్డు లేని గ్రామాలను రెండేళ్లలోనే తీర్చిదిద్దుతామని స్పష్టం చేశారు.

శ్రీకాకుళం రూరల్ మండలం సానివాడ గ్రామ పంచాయితీలో శుక్రవారం ఉదయం జరిగిన గ్రామ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై రచ్చబండ వద్ద మాట్లాడారు. సానివాడ గ్రామాన్ని ఆదర్శ గ్రామంగా తీర్చిదిద్దుతామని చెప్పారు. ప్రతి ఒక్కరూ సామాజిక స్పృహతో గ్రామ స్వరాజ్య స్థాపనకు భాగస్వామ్యం కావాలని మంత్రి పిలుపునిచ్చారు. గ్రామస్తులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు.

జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం గ్రామ సభల నిర్వహణతో స్థానిక సమస్యలు తెలుసుకుని, వాటిని పరిష్కరించేందుకు, ప్రత్యేక కార్యాచరణ ప్రణాళిక రూపొందించడానికి ఈ సభలు దోహదపడతాయని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ తెలిపారు. ప్రభుత్వం నిర్దేశించిన నాలుగు అంశాలపై చర్చించి గ్రామ నిర్మాణంతో గ్రామ వికాసం దిశగా అడుగులు వేయాలన్నారు. స్థానిక ఎమ్మెల్యే గొండు శంకర్ మాట్లాడుతూ? గ్రామ నమన్యలు నవోదు చేసుకోవాలని, ప్రజలు చెయ్యి చెయ్యి కలిపి గ్రామాభివృద్ధికి సమిష్టి కృషి చేయాలన్నారు.

గ్రామ సర్పంచ్ రుప్ప లక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా పరిషత్ సీఈవో వెంకటేశ్వర రావు, డ్వామా పీడీ ఎన్.వి.చిట్టిరాజు, జెడ్పీ డిప్యూటీ సీఈవో ఆర్.వెంకట్రామన్, జిల్లా వ్యవసాయ శాఖాధికారి కే.శ్రీధర్, జడ్పీటీసీ రుప్ప దివ్య ఎంపీటీసీ రుప్ప అప్పలసూరి, తదితరులు హాజరయ్యారు.

# దేశంలో సీప్లేన్ కార్యకలాపాల అభివృద్ధికి నదులు, సరస్సుల విస్తృతమైన నెట్‌వర్క్ ఒక ప్రత్యేక అవకాశాన్ని అందిస్తాయి - కేంద్రమంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 23:భారత దేశంలో సీప్లేన్ ఆపరేషన్స్ మార్గదర్శకాలను కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి శ్రీ కింజరాపు రామ్మోహన్ నాయుడు నేడు న్యూఢిల్లీలో విడుదల చేశారు. ఇండియన్ ఏవియేషన్ అకాడమీలో జరిగిన ఈ కార్యక్రమంలో కేంద్ర మంత్రి ప్రసంగిస్తూ, ఈ మార్గదర్శకాలు సీప్లేన్ కార్యకలాపాలను దేశంలోని విమానయాన రంగంలో రవాణా కోసం అనుసంధానించడమే కాకుండా, ఉపాధి కల్పన, ఆర్థిక సాధికారతను పెంపొందిస్తాయని అన్నారు. సీప్లేన్లను ఏర్పాటు చేయడం దేశ వృద్ధి, ఆవిష్కరణ, సమ్మిళిత అభివృద్ధిపై నిబద్ధతకు చిహ్నం అని మంత్రి అన్నారు.

ఇదే సమావేశంలో కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు ఉడాన్ 5.4 పథకాన్ని కూడా ఆవిష్కరించారు. ఉడాన్ 5.4 కింద ఏదో ఒక కారణంతో రద్దయిన మార్గాలకు, కొత్త మార్గాలకు టెండర్లు పిలవనున్నారు. డిహావిల్యాండ్ కంపెనీ తయారు చేసిన సీప్లేన్ విమానాల ప్రదర్శన త్వరలో జరుగుతుందని మంత్రి ప్రకటించారు.

భారతదేశంలో 7,517 కి.మీ పొడవైన సముద్రతీరం, నదులు, సరస్సుల విస్తృత నెట్‌వర్క్ దేశంలో సీప్లేన్ కార్యకలాపాల అభివృద్ధికి ఒక గొప్ప అవకాశాన్ని కల్పిస్తుందని కేంద్రమంత్రి అన్నారు. పరిస్థితిని క్షుణ్ణంగా అధ్యయనం చేసి, హెలికాప్టర్ ఆపరేషన్ల అనుభవాన్ని గ్రహించి, సీ ప్లేన్ కార్యకలాపాల వృద్ధిని నిర్ధారించడానికి ప్రభుత్వం సరళమైన, ఆచరణాత్మకమైన విధానాన్ని చేపట్టనుంది. నాన్ షెడ్యూల్డ్ ఆపరేటర్ పర్మిట్ (ఎన్ఎస్ఓపీ) కింద ఆర్సీఎస్ ద్వారా సీప్లేన్ ఆపరేషన్లను ప్రారంభించేందుకు ఈ మార్గదర్శకాలు వీలు కల్పిస్తాయి. ఆర్సిఎస్ కింద వయబిలిటీ గ్యాప్ ఫండింగ్ (విజిఎఫ్)ను సీప్లేన్ కార్యకలాపాలకు వర్తింపచేయడం ఆపరేటర్లకు ప్రోత్సాహాన్ని అందిస్తుంది. దీనితో పాటు సీప్లేన్ కార్యకలాపాల భద్రత, రక్షణ కోసం తగిన జాగ్రత్తలు తీసుకున్నారు.

వాటర్ ఏరో డ్రోమ్‌ల అభివృద్ధిలో ప్రారంభ సవాళ్లు ఉన్నప్పటికీ, సీప్లేన్ కార్యకలాపాలు నిరంతరం వృద్ధి చెందడానికి ప్రభుత్వం సరళమైన, ఆచరణాత్మక విధానాన్ని తీసుకుందని మంత్రి తెలియజేశారు. ఆర్సీఎస్ పథకం కింద హెలికాప్టర్లు, చిన్న విమానాల కోసం ఎన్ఎస్ఓపీ ఆపరేషన్ల విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని.. పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఇప్పుడు సమగ్ర సీప్లేన్ ఎన్ఎస్ఓపీ మార్గదర్శకాలను రూపొందించిందన్నారు. ఈ మార్గదర్శకాలు కార్యకలాపాల భద్రత, రక్షణకు ప్రాధాన్యత ఇస్తాయి. అలాగే ఇందులోని వాటాదారుల బాధ్యతలను కూడా నిర్వచిస్తాయి. దేశవ్యాప్తంగా నిరంతరాయం, సమర్థవంతమైన సీప్లేన్ ఆపరేషన్‌ను నిర్ధారిస్తాయి. సీప్లేన్ల కోసం నాన్ షెడ్యూల్డ్ ఆపరేటర్ పర్మిట్ (ఎన్ఎస్ఓపి) ఫ్రేమ్ వర్క్ ను స్వీకరించడంలోనూ, ప్రాంతీయ కనెక్టివిటీని పెంచడంలోనూ ప్రభుత్వ నిబద్ధతలో ఒక ముఖ్యమైన ముందడుగు.

భారతదేశంలో సీప్లేన్ పరిశ్రమకు అనుకూల విధాన అవసరాన్ని ఈ సందర్భంగా కేంద్రమంత్రి తెలిపారు. కర్బన ఉద్గారాలను తగ్గించడానికి ఎలక్ట్రిక్ సీప్లేన్ల వంటి సాంకేతిక పరిజ్ఞానాలపై పరిశోధనలను ప్రోత్సహించడం, వాతావరణ మార్పులపై ఐరాస ఫ్రేమ్‌వర్క్ కింద భారతదేశ కట్టుబాట్లకు అనుగుణంగా ఉండాలని కేంద్ర మంత్రి ఉద్ఘాటించారు. దీని కోసం రూపొందించే రెగ్యులేటరీ ఫ్రేమ్‌వర్క్ స్థానిక శ్రామిక శక్తి అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ, పైలట్లు, నిర్వహణ సిబ్బంది, గ్రౌండ్ సిబ్బందికి ఉపాధి అవకాశాలను సృష్టించే విధంగా ఉండాలన్నారు. సృజనాత్మకతను ప్రోత్సహించే, వృద్ధిని ప్రోత్సహించే విధానాలను తయారు చేయడం కేంద్రం లక్ష్యమని తెలిపారు. సీప్లేన్లు, ఇతర రవాణా విధానాల మధ్య అంతరాయం లేని అనుసంధానత కోసం మల్టీమోడల్ ట్రాన్స్ పోర్ట్ హబ్‌లను అభివృద్ధి చేయాలని ప్రభుత్వం భావిస్తున్నట్లు తెలిపారు.

కేంద్ర పౌర విమానయాన శాఖ సహాయ మంత్రి, సహకార మంత్రిత్వ శాఖ సహాయ మంత్రి శ్రీ మురళీధర్ మొహోల్ మాట్లాడుతూ, ఈ నిర్ణయం అనుసంధానాన్ని మెరుగుపరచడమే కాకుండా, పర్యాటకాభివృద్ధికి, ఆర్థిక వృద్ధిని ప్రోత్సహించడానికి, భారతదేశంలోని అత్యంత మారుమూల ప్రాంతాలను దగ్గర చేస్తుందని విశ్వాసం వ్యక్తం చేశారు. కొత్తగా రూపొందించే మార్గదర్శకాలు సీప్లేన్ కార్యకలాపాలను సురక్షితంగా, సమర్థవంతంగా నిర్వహించడానికి ఒక మంచి విధానాన్ని సూచిస్తాయి, ఇది భారతదేశ విమానయాన రంగంలో కొత్త శకంగా చెప్పవచ్చు అని ఆయన తెలపారు.

కేంద్ర పౌర విమానయాన శాఖ కార్యదర్శి శ్రీ వుమ్లున్‌మాంగ్ వుల్నామ్ మాట్లాడుతూ పౌరవిమానయాన మంత్రిత్వ శాఖ క్రియాశీల వైఖరిని అవలంబించిందని తెలిపారు. సీప్లేన్ నిర్వహణ కోసం నాన్ షెడ్యూల్డ్ ఆపరేటర్ పర్మిట్ (ఎన్ఎస్ఓపి) విధానాన్ని ఉపయోగించాలని నిర్ణయించినట్లు తెలిపారు. ఇది ఇప్పటికే ఆర్సిఎస్ పథకం కింద హెలికాప్టర్లు, చిన్న విమానాల విషయంలో విజయవంతమైందన్నారు. నేడు ప్రారంభిస్తున్న సీప్లేన్ ఎన్ఎస్ఓపి మార్గదర్శకాలు వాటర్ ఏరోడ్రోమ్ మౌలిక సదుపాయాల పూర్తి అభివృద్ధి కోసం పనిచేస్తున్నప్పటికీ, సీప్లేన్ కార్యకలాపాలు కొనసాగించడానికి, నిర్మాణాత్మక, సురక్షితమైన విధానాన్ని అందిస్తుందని ఆయన తెలిపారు.

ఈ కార్యక్రమంలో డీజీసీఏ డైరెక్టర్ జనరల్ శ్రీ విక్రమ్ దేవ్ దత్, పౌర విమానయాన మంత్రిత్వ శాఖ ఉన్నతాధికారులు, రాష్ట్ర, కేంద్ర పాలిత ప్రాంతాల ప్రభుత్వాధికారులు, ఎన్ఎస్ఓపీ, ఎస్ఓపీ ఆపరేటర్లు, మొదటి దశ పరికరాల తయారీదారులు (ఓఈఎం), సీప్లేన్ తయారీదారులు, మీడియా సిబ్బంది పాల్గొన్నారు.

# కేంద్ర విద్యా శాఖ ఆధ్వర్యంలో ప్రత్యేక అభ్యసన వైకల్యాలపై రెండో విడత నైపుణ్య కార్యక్రమం

న్యూఢిల్లీ, ఆగష్టు 23:చదవడం, రాయడం తదితర అభ్యాసన విషయాల్లో నైపుణ్యం లేక ఇబ్బందులు పడుతున్న వారికి తగిన ప్రావీణ్యాన్ని అందించే ఉద్దేశంతో మాళవీయ మిషన్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం (ఎం.ఎం.టి.టి.పి) కింద రెండో విడత కార్యక్రమాన్ని కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ ప్రారంభించింది. తొలివిడత కార్యక్రమం సాధించిన విజయాన్ని దృష్టిలో పెట్టుకుని దీనిని రూపొందించారు. ప్రత్యేక అభ్యసన వైకల్యాలు కలిగిన విద్యార్థులకు ఉపయోగపడేలా ఉన్నత విద్యా సంస్థలకు అవసరమైన నైపుణ్యాలు, విజ్ఞానాన్ని సమకూర్చేలా దీనికి రూపకల్పన చేశారు.

కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు చెందిన ఉన్నత విద్యాశాఖ కార్యదర్శి శ్రీ .కె.సంజయ్ మూర్తి, ఉన్నత విద్యా శాఖ అదనపు కార్యదర్శి శ్రీ ఎస్.కె. బన్వల్, ఉన్నత విద్యాశాఖ సంయుక్త కార్యదర్శి శ్రీమతి రీనా సోనోవాల్ కౌలి, ఉన్నత విద్యా శాఖ డైరెక్టర్ శ్రీ దేవేంద్ర కుమార్ శర్మ, చాంగీన్క్స్ ఫౌండేషన్ సహ వ్యవస్థాపకులు శ్రీమతి నూపూర్ ఝున్ ఝున్ వాలా లు ఈ రెండో విడత కార్యక్రమ ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు.

కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహాయంతో నిర్వహిస్తున్న, ఎంపిక చేసిన 45 సంస్థల అధిపతులు, అధ్యాపకులు దృశ్యమాధ్యమం ద్వారా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్నారు. వీరిలో కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు, ట్రిపుల్ ఐటిలు, ఎన్ఐటిలు, ఐఐఎస్ఇఆర్లు, సిఎఫ్టిఐలు, ఎస్పిఎలు, ఎన్ఐటిటిటిఆర్లు తదితరాలకు చెందిన వారు ఉన్నారు.

అందరికీ సమ్మిళిత విద్య, సమాన విద్య దార్శనికతతో 2020 లో ప్రవేశపెట్టిన నూతన విద్యావిధానం, విద్యార్థులలో ప్రత్యేక వైకల్యాలున్న వారిని గుర్తిస్తున్నదని శ్రీ కె.సంజయ్ మూర్తి ప్రస్తావించారు. ప్రత్యేక వైకల్యాలు, అభ్యసన వైకల్యాలున్న విద్యార్థుల విషయంలో అవగాహన కలిగి ఉండి వారు ఎదుర్కొనే సవాళ్లను పరిష్కరించడంలో ఉన్నత విద్యా సంస్థలు సున్నితత్వం కలిగి ఉండాలని నూతన విద్యా విధానం నిర్దేశిస్తున్నదన్నారు. ఈ సమస్యను అధిగమించడంలో, క్రమం తప్పకుండా ,అభ్యసన వైకల్యాలు ఎదుర్కొంటున్న వారిలో నైపుణ్యాలు పెంచే కార్యక్రమాలు నిర్వహించడం అవసరం. మాలవీయ మిషన్ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమం కింద, ప్రత్యేక అభ్యసన వైకల్యాలు కలిగిన వారికి సంబంధించి తోడ్పడేందుకు కీలక భాగస్వాముల సామర్థ్యాల నిర్మాణ కార్యక్రమానికి ఎలా రూపకల్పన చేసింది ఆయన వివరించారు.

ప్రత్యేక వైకల్యాలు కలిగిన వారికి సంబంధించి, తొలివిడత కార్యక్రమం జనవరి 2024 నుంచి జూలై వరకు జరిగింది. చాంగీన్క్స్ ఫౌండేషన్ భాగస్వామ్యంతో దీనిని నిర్వహించారు. తొలివిడతలో 27 ఉన్నత విద్యా సంస్థలు ఇందులో పాల్గొన్నాయి. వీటిలో కేంద్ర విశ్వవిద్యాలయాలు, ఐఐటిలు, ట్రిపుల్ ఐటిలు, ఐఐఎం లు, ఐఐఎస్ఇఆర్లు, ఎస్.పి.ఎలు ఎన్.ఐ.టిలు ఉన్నాయి. ఈ కార్యక్రమం కింద పలు సెషన్లు నిర్వహించారు. వీటిలోపునశ్చరణ కార్యక్రమాలు, ;ప్రత్యేక అభ్యసన అవసరాలు కలిగిన వారి అవసరాలను అర్థం చేసుకునే లా చూడడం, మాస్టర్ క్లాస్లు, జోన్ వారీగా వ్యక్తిగత వర్క్ షాప్ లు, వీటి అమలు, పర్యవేక్షణ వంటివి ఉన్నాయి. ఈ సంస్థలకు చెందిన వివిధ విభాగాల నుంచి 400మందికి పైగా అధ్యాపకులు పాల్గొన్నారు.

రెండో విడత కార్యక్రమం 2024 ఆగస్టు 22న ప్రారంభమైంది. ఇది 2024 డిసెంబర్ వరకు జరుగుతుంది. ఆన్లైన్ ద్వారా, వ్యక్తిగత హాజరు పద్ధతిలో కొత్తగా ఎంపిక చేసిన ఉన్నత విద్యా సంస్థల వారితో జరుగుతోంది. ప్రత్యేక అభ్యసన అవసరాలు కలిగిన వారి అవసరాలను గుర్తించడలో అనుసరించాల్సిన వ్యూహం, ఉపకరణాలపై ఈ కార్యక్రమం దృష్టిపెడుతుంది. వివిధ విద్యా సంస్థల అధిపతులకు అవగాహన కల్పించడంపై దృష్టిపెడుతుంది. ఐదు విభాగాల అధిపతులు, వారితోపాటు ఆయా విభాగాల నుంచి ఇద్దరు నామినీలు ఈ కార్యక్రమంలో పాల్గొంటున్నారు. వీరు ముఖాముఖి వర్క్ షాపులు, నిపుణులతో కూడిన సదస్సులు, పరిపూర్ణ అభ్యసన వాతావరణాన్ని కల్పించే సామర్థ్యాలను వారిలో పెంపొందింప చేయడం వంటి పలు కార్యక్రమాలలో పాల్గొంటారు. ఈ కార్యక్రమం ఆరునెలల పాటు విజయవంతంగా పూర్తి చేసుకున్న తర్వాత, కొత్త ఉన్నత విద్యా సంస్థలకు చెందిన వారితో మరో విడత కార్యక్ర మం నిర్వహిస్తారు. సమ్మిళిత విద్య అవసరం ఎంత ముఖ్యమో శ్రీ ఎస్.కె. భర్న్వాల్ పేర్కొన్నారు. విద్యార్థుల వైవిధ్య అవసరాలను తీర్చడంలో , అధ్యాపకులను తగిన విధంగా సన్నద్ధులుగా చేయడంలో ఈకార్యక్రమం కీలకపాత్ర పోషిస్తుందన్నారు. ప్రత్యేక వైకల్యాలు కలిగిన విద్యార్థులకు సంబంధించిన సమస్యల పరిష్కారంలో ఉన్నత విద్యాసంస్థలు ముందుకు వచ్చి ఆదిశగా కృషి చేయాలని కూడా ఆయన పిలుపునిచ్చారు.

# గత సంవత్సరం చంద్రబాబుపై దాడిపై కేసు నమోదు చేయాలంటున్న టీడీపీ



అమరావతి, ఆగష్టు 23 : సాగునీటి ప్రాజెక్టుల విధ్వంసంపై యుద్ధభేరి కార్యక్రమంలో భాగంగా శుక్రవారం కర్నూలు నగరంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయం ఎదుట టీడీపీ శ్రేణులు నిరసన నిర్వహించారు.

ఈ సందర్భంగా తెలుగుదేశం వ్యవస్థాపకులు ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలలు వేశారు.

ఈ సందర్భంగా టీడీపీ జిల్లా అధ్యక్షులు తిక్కారెడ్డి మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడు 2023 ఆగస్టు 4న అన్నమయ్య జిల్లాలో పర్యటించిన సందర్భంగా అంగళ్ళులో చంద్రబాబు నాయుడుపై దాడి చేసిన వైసీపీ నాయకులను గుర్తించి కేసులు నమోదు చెయ్యాలని, ప్రస్తుత సీఎం చంద్రబాబునాయుడు, టీడీపీ కార్యకర్తలు, నాయకులపై తప్పుడు కేసులు పెట్టిన పోలీసు అధికారులపై చర్యలు తీసుకోవాలని కోరారు.

రాష్ట్ర తెలుగు యువత అధ్యక్షులు శ్రీ రాం చిన్నబాబు, కర్నూలు జిల్లా తెలుగు యువత అధ్యక్షులు యన్.అబ్బాస్, పర్వీన్ తాజ్, దొరస్వామి నాయుడు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వై.నాగేశ్వర రావు యాదవ్, తెలుగు యువత నాయకులు రవి కుమార్, పేరపోగు రాజు, కురువ పరమేశ్, ఎల్.వి.ప్రసాద్, గట్టు తిలక్ మొదలగు వారితో కలిసి కర్నూలు నగరంలోని డి.ఐ.జి కార్యాలయంలో డి.ఐ.జి కోయ ప్రవీణ్ ను కలిసి వినతిపత్రం అందజేశారు.

# డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తిరుపతిలో ఘన స్వాగతం



తిరుపతి, ఆగష్టు 23 :గత రెండు రోజులుగా రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న గ్రామసభల నేపథ్యంలో ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ శుక్రవారం గ్రామసభల్లో పాల్గొనేందుకు అన్నమయ్య జిల్లాకు చేరుకున్నారు. శుక్రవారం ఉదయం రేణిగుంట విమానాశ్రయం చేరుకోగా, ప్రజాప్రతినిధులు, అధికారులు ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన రోడ్డు మార్గంలో రాయచోటికి చేరుకున్నారు. అక్కడి గ్రామసభలో పాల్గొన్నారు.

రేణిగుంట విమానాశ్రయంలో డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ కు తిరుపతి ఎమ్మెల్యే ఆరని శ్రీనివాసులు, చంద్రగిరి ఎం ఎల్ ఎ పులివర్తి నాని, జాయింట్ కలెక్టర్ శుభం బన్సల్, జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు, ఆర్డీఓ రవి శంకర్ రెడ్డి, ప్రోటోకాల్ ఎస్ డీసీ చంద్రశేఖర్, సీసీ ఎఫ్ చంద్ర శేఖర్ రావు, డీఎఫ్ ఓ నతీష్ రెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులు స్వాగతం పలికారు.

# గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే నా లక్ష్యం - పవన్ కళ్యాణ్

కడప ఆగష్టు 23 :రైల్వే కోడూరు: రైల్వేకోడూరు: రాజకీయాలకు అతీతంగా రాష్ట్రాభివృద్ధి కోసం ఆలోచించామని ఏపీ డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ అన్నారు. గ్రామాలకు ఏం కావాలనేదానిపై చిత్తశుద్ధితో ఆలో స్తేనే మంచి జరుగుతుందని చెప్పారు. రాష్ట్ర అభివృద్ధి, స్వర్ణ గ్రామాలు చేసుకోవాలనేదే లక్ష్యమన్నారు. గ్రామాలు పచ్చగా ఉంటే మనమంతా హాయిగా ఉంటామన్నారు.

అన్నమయ్య జిల్లా రైల్వేకోడూరు మండలం మైసూరువారిపల్లెలో 'స్వర్ణ గ్రామ పంచాయతీ' పేరిట నిర్వహించిన గ్రామ సభలో పవన్ పాల్గొని మాట్లాడుతూ, వైసీపీ హయాంలో పంచాయతీ వ్యవస్థ నిర్వీర్యమైందని పేర్కొన్నారు. 75 శాతం గ్రామాల్లో వైసీపీకి చెందిన సర్పంచ్‌లే ఉన్నారన్నారు. రాష్ట్రస్థాయి నుంచి జాతీయస్థాయి వరకు.. ప్రతి ఒక్కరూ రాష్ట్ర అభివృద్ధి కోసమే కృషి చేయాలని పవన్ పేర్కొన్నారు. దేశానికి వెన్నెముక పంచాయితీ రాజ్ వ్యవస్థ అని పేర్కొన్నారు. స్వర్ణ పంచాయతీల ఏర్పాటే అందరి లక్ష్యమని తెలిపారు.

రాజకీయాలకు అతీతంగానే అభివృద్ధే కూటమి లక్ష్యమన్నారు. దేశభక్తి పంచాయతీల నుంచే రావాలన్నారు. గ్రామస్థాయి నుంచి వచ్చిన నాయకులే జాతీయ స్థాయికి వెళ్లారన్నారు. పంచాయతీ వ్యవస్థ దేశానికి వెన్నెముక అని పవన్ పేర్కొన్నారు. గ్రామాలు బాగుంటేనే దేశం బాగుంటుందని తెలిపారు. పదవులు తనకు అలంకరణ కాదని.. బాధ్యత అని డిప్యూటీ సీఎం స్పష్టం చేశారు. చంద్రబాబు అపార అనుభవం ఏపీకి అవసరమని పేర్కొన్నారు.

ఏపీని అప్పుల బారి నుంచి తప్పించి.. సంపద సృష్టించేందుకు చంద్రబాబు అనుభవం అవసరమని పవన్ పేర్కొన్నారు. చంద్రబాబు నుంచి నేర్చుకోవడానికి తాను ఎప్పుడూ సిద్ధమన్నారు. ప్రభుత్వ భూముల రక్షణకు సరికొత్త చట్టం తెస్తామన్నారు. ఐదేళ్లలో 20 గ్రామసభలు జరిగేలా చూస్తామని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. ప్రతి పంచాయతీకి సొంత భూమి ఉండాలన్నారు. ప్రభుత్వ భూములను కబ్జా చేస్తే ఊరుకునేది లేదని హెచ్చరించారు. అవసరమైతే గూండా యాక్ట్ కూడా తెస్తామన్నారు. గ్రామాల్లో కళాశాలలు, క్రీడా మైదానాలు లేని దుస్థితి నెలకొందని వాపోయారు. ప్రభుత్వ భూములు ఉంటే నిర్మాణాలు చేసుకోవచ్చన్నారు. ప్రభుత్వ పరంగా పంచాయతీకి ఆస్తులు లేకపోతే వ్యర్థమేనన్నారు. దాతలు ముందుకొస్తే తాను కూడా నిధులు తీసుకొచ్చి.. క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తానని పవన్ కళ్యాణ్ వెల్లడించారు.

బాధ్యతల నుంచి తాము పారిపోబోమని.. నిరంతరం పని చేస్తామని పవన్ తెలిపారు. అద్భుతాలు చేయడానికి చేతిలో మంత్రదండం లేదని.. గుండెల నిండా నిబద్ధత ఉందన్నారు. చంద్రబాబు అనుభవం ఏపీకి అవసరమని తాను చాలా సభల్లో చెప్పానన్నారు. అప్పుల్లో ఉన్న రాష్ట్రాన్ని గట్టెక్కించగలిగేది ఒక్క చంద్రబాబేనన్నారు. లక్షల మందికి ఒకటో తేదీనే పెన్షన్లు ఇవ్వగలిగారని చంద్రబాబును పవన్ ప్రశంసించారు. తన కంటే బాగా ఆలోచించగలిగేవాళ్ల వెంట నడిచేందుకు తానెప్పుడూ సంకోచించబోనన్నారు. పరిపాలన అనుభవం ఉన్న చంద్రబాబు నుంచి ఎంతో నేర్చుకోవాలనే తపను తనకు ఉందన్నారు. ప్రజల కోసం కూలీ మాదిరిగా పనిచేసేందుకు తాను సిద్ధమని డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ స్పష్టం చేశారు. గ్రామాలను ఆర్థికంగా బలోపేతం చేయడమే తన లక్ష్యమని,అందుకు గ్రామ స్థాయిలోని అందరూ సహకరించాలని కోరారు.

విద్య గురించి మాట్లాడుతూ, ఒక అబ్బాయి చదువుకుంటే తాను మాత్రమే అభివృద్ధి అవుతాడు, ఒక అమ్మాయి చదువుకుంటే కుటుంబం మొత్తం అభివృద్ధి అవుతుందని పవన్ అన్నారు.. అలాగే పంచాయితీలు బలోపేత గురించి చెబుతూ, ప్రతి పంచాయతీకి దాని సొంత భూమి ఉండాలనేది తన అభిప్రాయం అన్నారు..

సినిమాలు రాజకీయాలు వేరు వేరు

సినిమాలని, రాజకీయాలని చాలా ప్రత్యేకంగా చూస్తానన్నారు జనసేనాని.. తనకు సినిమాలకంటే దేశం ముఖ్యమని అన్నారు..అలాగే సినిమాల కంటే సమాజం, సినిమాలకంటే గ్రామాల హితం ముఖ్యమని తెల్చి చెప్పారు.. పదవీ తనకు అలంకారం కాదని అది బాధ్యత అని వినమ్రంగా చెప్పారు పవన్ ..

## అభయారణ్యంలో సంచరించిన పెద్దపులి..

ఆదిలాబాద:, ఆగష్టు 23 : బాబోయ్ టైగర్.. మంచిర్యాల జిల్లా జన్నారం డివిజన్ కవ్వాల పులుల అభయారణ్యం అడవుల్లో పెద్దపులి సంచరిస్తుంది. ఈ మేరకు మంచిర్యాల డీఎఫ్ఓ శివ ఆశిష్ సింగ్, తాళ్లపేట రేంజ్ ఆఫీసర్ సుష్మారావు, ఇతర అధికారుల ఆధ్వర్యంలో అటవీ శాఖ అధికారులందరూ శుక్రవారం సాయంత్రం అడవులకు సమీపాన ఉన్న గ్రామాల్లో దండోరా వేయించారు. అడవుల్లో పెద్దపులి సంచరిస్తుందని పశువుల కాపరులు, సమీప గ్రామాల ప్రజలు అడవులకు వెళ్లకూడదని ప్రచారం చేశారు.

అడవిలోకి వెళ్ళిన ఓ పశువుల కాపరికి పెద్దపులి కనిపించినట్లు తెలిసింది. దీంతో అటవీ అధికారులందరూ అప్రమత్తమయ్యారు. ఆ పెద్దపులి అడుగులను నిర్ధారించారు. గత వారం రోజుల క్రితం కొమురం భీం ఆసిఫాబాద్ అడవుల్లోని గుండాల అడవుల్లో పెద్దపులి సంచరించినట్లు ఈ మేరకు కవ్వాల అభయారణ్యంలోని అడవుల్లో పెద్దపులి అడుగులను గుర్తించినట్లు సమాచారం.

# బొగ్గు రంగంలో పరిశోధన, అభివృద్ధి ప్రాజెక్టులపై సలహాల కోసం స్టాండింగ్ సైంటిఫిక్ రీసెర్చ్ కమిటీ సమావేశం

న్యూఢిల్లీ, ఆగష్టు 23:బొగ్గు మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ అమృత్ లాల్ మీనా అధ్యక్షతన స్టాండింగ్ సైంటిఫిక్ రీసెర్చ్ కమిటీ (ఎస్ఎస ఆర్సీ) ప్రత్యేక సమావేశం 2024 ఆగష్టు 21న ద్విమాధ్యమ విధానంలో జరిగింది. ఈ సమావేశంలో బొగ్గు శాఖ అదనపు కార్యదర్శి రూపిందర్ బ్రార్.. సంయుక్త కార్యదర్శి, ఆర్థిక సలహాదారు శ్రీమతి విస్మితా తేజ్, సలహాదారు(ప్రాజెక్టులు) శ్రీమతి నిరుపమ కొట్రు, మంత్రిత్వ శాఖకు చెందిన ఇతర సీనియర్ అధికారులు, ఎస్ఎస్ఆర్సీ సభ్యులు, వివిధ విద్యా సంస్థలు, పరిశోధన సంస్థలు, ప్రముఖ మైనింగ్ కంపెనీల ప్రతినిధులు పాల్గొన్నారు. బొగ్గు రంగంలోని పరిశోధన, అభివృద్ధి (ఆర్ అండ్ డీ) ప్రాజెక్టులు, అన్వేషణ పద్ధతులను అభివృద్ధి చేయడం, బొగ్గు ఉత్పత్తిని పెంచడం, భద్రతా చర్యలను మెరుగుపరచడం, పర్యావరణాన్ని రక్షించడంపై ఈ సమావేశం ప్రత్యేకంగా దృష్టి సారించింది.

శాస్త్ర, సాంకేతిక విభాగం(డీఎస్టీ), నీతి ఆయోగ్, డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ మైన్స్ సేఫ్టీ(డీజీఎంఎస్) వంటి మంత్రిత్వ శాఖలు, విభాగాల ప్రతినిధులతో పాటు కోల్ ఇండియా లిమిటెడ్ (సీఐఎల్), ఎన్ఎల్సీ ఇండియా లిమిటెడ్(ఎన్ఎల్సీఐఎల్), సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్(ఎస్సీసీఎల్), సెంట్రల్ మైన్ ప్లానింగ్ అండ్ డిజైన్ ఇని స్టిట్యూట్ (సీఎంపీడీఐ) నుంచి పరిశ్రమ ప్రతినిధులు ఎస్ఎస్ఆర్సీలో ఉన్నారు. ఐఐటీ(ఐఎస్ఎం) ధన్‌బాద్, ఐఐటీ(బీహెచ్‌యూ) వారణాసి, ఐఐటీ కాన్పూర్ వంటి ప్రముఖ విద్యా సంస్థలతో పాటు సెంట్రల్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ మైనింగ్ అండ్ ఫ్యూయల్ రీసెర్చ్ (సీఐఎంఎఫ్ ఆర్), సెంట్రల్ మెకానికల్ ఇంజనీరింగ్ రీసెర్చ్ ఇనిస్టిట్యూట్(సీఎంఈఆర్ఐ) వంటి పరిశోధనా సంస్థలు కూడా ఈ సమావేశంలో పాల్గొన్నాయి.

ఈ సమావేశంలో బొగ్గు రంగంలో పరిశోధన, అభివృద్ధికి సంబంధించిన వివిధ అంశాలపై సమగ్ర ప్రజెంటేషన్ ఇస్తూ సవాళ్లు, తీసుకుంటున్న చర్యలు, ముందుకు సాగే మార్గాన్ని సీఎంపీడీఐ ప్రతినిధులు నొక్కి చెప్పారు. పరిశోధన ఫలితాలను వివిధ వర్గాల వారికి అందించడానికి చేపట్టిన కీలక కార్యక్రమాలు, చర్యల గురించి వివరించారు. బొగ్గు, ఇంధన రంగాల్లోని వివిధ విభాగాల్లో పరిశోధనలను ముందుకు తీసుకెళ్లేందుకు రాంచీలోని సీఎంపీడీఐలో 'నేషనల్ సెంటర్ ఫర్ కోల్ అండ్ ఎనర్జీ రీసెర్చ్(ఎన్ఏసీసీఈఆర్)' ఫేజ్-1ను ఏర్పాటు చేస్తున్నారు. అదనంగా, సీఐఎల్/ఎంఓసీ(బొగ్గు మంత్రిత్వ శాఖ) ఆర్ అండ్ డీ లేదా ఎస్ అండ్ టీ పథకాల కింద పూర్తైన, కొనసాగుతున్న అనేక అధిక ప్రభావ ప్రాజెక్టులను వివరించారు.

# తాటిచెట్టు పైనుండి పడి గీత కార్మికుని మృతి..

ఆదిలాబాద్, ఆగష్టు 23 : : చెన్నూరు మండలం గుండయ్యపల్లి గ్రామానికి చెందిన ముక్కెర సతీష్ గౌడ్ అనే గీత కార్మికుడు తాటిచెట్టు పైనుండి పడి మృతిచెందాడు. తెలిసిన వివరాల ప్రకారం? గుండయ్యపల్లి గ్రామానికి చెందిన సతీష్ సమీప గ్రామమైన సుబ్బరంపల్లి గ్రామంలోని తాటిచెట్లు గీస్తూ జీవనం సాగిస్తున్నాడు.

రోజు వారిలాగే ఇవ్వాళ సాయత్రం తాటిచెట్టు ఎక్కి గీస్తున్న సమయంలో అదుపు తప్పి క్రింద పడడంతో ఇరుగు పొరుగువారు గమనించి 108 సహాయంతో చెన్నూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే మృతి చెందినట్లు కుటుంబ సభ్యులు పేర్కొన్నారు. మృతునికి భార్య కనకలక్ష్మి ఉన్నారు.

# జమ్మూకాశ్మీర్, హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు 400 మంది పరిశీలకులను నియమించనున్న ఈసీఐ




న్యూఢిల్లీ, ఆగష్టు 23:జమ్మూ కాశ్మీర్, హర్యానా అసెంబ్లీలకు జరుగుతున్న సార్వత్రిక ఎన్నికల కోసం కేంద్ర ఎన్నికల సంఘం(ఈసీఐ) ఆయా రాష్ట్రాల్లో నియమితులవుతున్న పరిశీలకులతో సమావేశం(బ్రీఫింగ్ మీటింగ్) నిర్వహించింది. సీఈసీ రాజీవ్ కుమార్, ఈసీలు జ్ఞానేష్ కుమార్, డాక్టర్ ఎస్ఎస్ సంధు ఆయా నియోజకవర్గాల్లో సంబంధిత పరిశీలకులు పోషించాల్సిన ముఖ్యమైన పాత్రను వివరించారు.

ఢిల్లీలోని రంగ్ భవన్ ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన ఈ సమావేశానికి ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు, ఇండియన్ రెవెన్యూ సర్వీస్, ఇతర కేంద్ర సర్వీసులకు చెందిన 400 మందికి పైగా సీనియర్ అధికారులు హాజరయ్యారు. జమ్మూకాశ్మీర్, హర్యానాలో 200 మంది సాధారణ పరిశీలకులు, 100 మంది పోలీస్ పరిశీలకులు, 100 మంది వ్యయ పరిశీలకులను నియమించనున్నారు.

ఎన్నికల సంఘం ప్రతినిధులుగా- పరిశీలకులు వృత్తిపరంగా వ్యవహరించాలని.. అభ్యర్థులు, ప్రజలతో సహా భాగస్వాములందరికీ అందుబాటులో ఉండాలని ప్రధాన ఎన్నికల కమిషనర్ రాజీవ్ కుమార్ తెలిపారు. భాషాపరమైన అడ్డంకులను అధిగమించాలని, సమాచార వినిమయంలో అంతరాలు లేకుండా చూసుకోవాలని సూచించారు. పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లతోపాటు, ఎన్నికల సంఘం పర్యవేక్షణలో పరిశీలకులు కూడా ఉంటారని, ఎన్నికలు సజావుగా జరిగేలా చూడటంలో వారి సూచనలు కీలకం అవుతాయని పేర్కొన్నారు. సకాలంలో చర్యలు తీసుకునేందుకు వీలుగా ఎన్నికల ప్రక్రియను పక్కదారి పట్టించే తప్పుడు కథనాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఆయన పరిశీలకులకు సూచించారు.

స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికల కోసం పరిశీలకులు పూర్తి ఎన్నికల వాతావరణాన్ని పరిశీలించాలని ఎన్నికల కమిషనర్ జ్ఞానేష్ కుమార్ ఈ సందర్భంగా నొక్కి చెప్పారు. అసెంబ్లీ ఎన్నికల్లో పోటీ హోరాహోరీ అన్నట్లు జరుగుతున్నాయని, ఈ ఎన్నికల్లో పరిశీలకుల పాత్ర మరింత కీలకమని ఆయన అన్నారు.

కమిషన్ కు కళ్లు, చెవులు అన్న పాత్రను పరిశీలకుల పోషించనున్న దృష్ట్యా మూడు అంశాలను ఈసీ డాక్టర్ సంధు నొక్కి చెప్పారు. ఎన్నికల నిర్వహణను మెరుగుపరిచేందుకు అందుబాటులో ఉండటం (యాక్సెసిబిలిటీ), అందరికీ తెలియటం(విజిబిలిటీ), స్పందించటం (రెస్పాన్సివ్ నెస్) చాలా అవసరమని పేర్కొన్నారు. ఎన్నికలు పకడ్బందీగా జరగడానికి ఈ ప్రక్రియ అవసరమని చెప్పారు.కమిషన్ తీసుకొచ్చిన వివిధ నూతన కార్యక్రమాలు, మార్గదర్శకాలను వివరించారు.

- సమస్యలను సకాలంలో పరిష్కరించేందుకు అన్ని పార్టీలు, అభ్యర్థులు, ఓటర్లకు అందుబాటులో ఉండాలి. ఈ విషయంలో ఏవైనా ఫిర్యాదులు వస్తే కమిషన్ తీవ్రంగా పరిగణిస్తుంది.

-మొబైల్, ల్యాండ్ లైన్ నంబర్లు, ఈ-మెయిల్స్, బస చేసే ప్రదేశాలు మొదలైన వివరాలను సీఈఓ లేదా జిల్లా వెబ్ సైట్లలో, ఎలక్ట్రానిక్, ప్రింట్ మీడియా ద్వారా విస్తృతంగా ప్రచారం చేయాలి. ఆయా నియోజక వర్గాలకు పరిశీలకులు వచ్చిన రోజున డీఈవోలు, ఆర్వోలు అభ్యర్థులు, గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలకు ఈ విషయాలను అందించాలి.

-డీఈవోలు, ఆర్వోలు నిర్వహించే రాజకీయ పార్టీల సమావేశాలను పరిశీలించి, వారి సమస్యలను సక్రమంగా విని చర్యలు తీసుకునేలా పరిశీలకులు చూడాలి.

- క్షేత్రస్థాయిలో కమిషన్ కళ్లు, చెవులుగా పరిశీలకులు అత్యంత చిత్తశుద్ధితో నిరంతరం అప్రమత్తంగా ఉండాలి. ఒక మార్గదర్శకత్వం వహించే వ్యక్తిగా, పరిశీలకులు ప్రతి సూచన, ప్రక్రియను స్పష్టంగా అర్థం చేసుకోవాలి.

-ఎన్నికల యంత్రాంగం, అభ్యర్థులు, రాజకీయ పార్టీలు, ఓటర్ల మధ్య పనిచేస్తున్నందున పరిశీలకులు క్షేత్రస్థాయి నుంచి కమిషన్‌కు నేరుగా సమాచారాన్ని అందిస్తారు.

-ఎన్నికలకు సంబంధించిన చట్టాలు, నియమాలు, విధివిధానాలు, సూచనలు, మార్గదర్శకాలను సంబంధిత వారంతా కచ్చితంగా, నిష్పక్షపాతంగా పాటించేలా చూడాలని పరిశీలకులను ఆదేశించారు.

-వికలాంగులు, వృద్ధ ఓటర్లకు ఎన్నికలను సౌకర్యవంతంగా ఉండేలా చూసుకునేందుకు పోలింగ్ కేంద్రాలను పరిశీలకులు సందర్శించి ఏఎంఎఫ్ స్పెషాలిటీ ర్యాంపులు, వీల్ చైర్ సౌకర్యాలు అందుబాటులో ఉండేలా చూడాలని తెలిపారు.

రోజంతా జరిగిన ఈ కార్యక్రమంలో.. ఎన్నికల నిర్వహణకు సంబంధించిన వివిధ అంశాలపై ఈసీఐ సీనియర్ డిప్యూటీ కమిషనర్, డీఈసీలు, డీజీలు అధికారులకు సమగ్ర అవగాహన కల్పించారు. ఎన్నికల ప్రణాళిక.. పరిశీలకుల పాత్ర, బాధ్యతలు.. ఓటర్ల జాబితా సమస్యలు, ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలు, ఎన్నికల వ్యయ పర్యవేక్షణ, చట్టపరమైన నిబంధనలు, ఈవీఎం/వీవీప్యాట్ నిర్వహణ, మీడియా నిర్వహణ, కమిషన్ ప్రతిష్ఠాత్మక స్వీప్ (సిస్టమాటిక్ ఓటర్స్ ఎడ్యుకేషన్ అండ్ ఎలక్టోరల్ పార్టిసిపేషన్) కార్యక్రమం కింద ఓటరు సౌలభ్యం కోసం చేపట్టిన విస్తృత కార్యకలాపాలపై వివరణాత్మక ప్రజెంటేషన్లు ఇచ్చారు.

ఓటర్ల సౌకర్యార్థం కమిషన్ చేపట్టిన వివిధ ఐటీ కార్యక్రమాలు, మొబైల్ యాప్‌లతో పాటు క్షేత్రస్థాయిలో ఎన్నికల ప్రక్రియలను సమర్థవంతంగా, ప్రభావవంతంగా నిర్వహించడంపై పరిశీలకులకు అవగాహన కల్పించారు. ఈవీఎంలు, వీవీప్యాట్‌ల పనితీరును పరిశీలకులకు ప్రత్యక్షంగా వివరించారు. ఈవీఎంలను పూర్తిగా సురక్షితంగా, దృఢంగా, విశ్వసనీయంగా, ట్యాంపరింగ్ రహితంగా మార్చేందుకు వీలుగా ఈవీఎం వ్యవస్థలో ఉన్న బహుళ సాంకేతిక భద్రతా ఫీచర్లు, అధికారిక నిబంధనలు, విధానపరమైన రక్షణల గురించి వారికి తెలియజేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి, వాటికి సంబంధించిన ఆందోళనల విషయంలో అన్ని అంశాలపై నవీకరించిన, సమగ్రమైన మాన్యువల్స్, హ్యాండ్ బుక్‌లు, సూచనల సంకలనాలు.. చేయవలసినవి, చేయకూడని పనులను పరిశీలించాలని తెలియజేశారు. ఏవైనా సూచనలు, మార్గదర్శకాలను సులభంగా తెలుసుకునేందుకు.. ఇవి ఈ-బుక్, శోధించదగిన (సెర్చేబుల్) ఫార్మాట్లో ఈసీఐ వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉన్నాయి.

ప్రజా ప్రాతినిధ్య చట్టం-1951లోని సెక్షన్ 20బీ, రాజ్యాంగ సర్వసత్త అధికారాల కింద కమిషన్ పరిశీలకులను నియమిస్తుంది. మన ప్రజాస్వామ్య వ్యవస్థకు పునాది అయిన ఎన్నికల ప్రక్రియను, పారదర్శక, నిష్పాక్షికంగా, విశ్వసనీయంగా జరిగేలా చూసే కీలక బాధ్యతను పరిశీలకులకు నెరవేర్చనున్నారు. కమిషన్ తన సాధారణ, పోలీస్, వ్యయ పరిశీలకులపై ఎంతో విశ్వాసం ఉంచుతుంది. స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక ఎన్నికలు జరిగేలా కమిషన్ చూసుకోవటంలో పరిశీలకుల పాత్ర చాలా ముఖ్యమైనది. ఈ కేంద్ర పరిశీలకులు స్వేచ్ఛాయుత, నిష్పాక్షిక, పారదర్శక, సమ్మిళిత ఎన్నికలను నిర్వహించాలనే రాజ్యాంగ బాధ్యతను కమిషన్ నెరవేర్చడంలో సహాయపడటమే కాకుండా.. ఓటరు అవగాహన, ఎన్నికల్లో వారి భాగస్వామ్యాన్ని పెంచడానికి కూడా సహాయం అందిస్తారు. మెరుగుపరుచుకోవాల్సిన అంశాలను గుర్తించి..ఖచ్చితమైన, కార్యాచరణకు సంబంధించిన సిఫార్సులను రూపొందించటం ఎన్నికల పరిశీలన ప్రధాన లక్ష్యం. ఈ పరిశీలకులు కమిషన్‌కు కళ్లు, చెవులుగా పేరు పొందారు.

# కొల్హాపూర్ రాజకుటుంబం గొప్పతనం గురించి శ్రీ జ్ఞానేశ్వర్ ములే చాలా చక్కగా రాశారు: ప్రధాన మంత్రి

న్యూఢిల్లీ, ఆగష్టు 23:కొల్హాపూర్ రాజకుటుంబం, దూరదృష్టి గల మహారాజులు, మహారాణి తారాబాయి గొప్పతనాన్ని శ్రీ జ్ఞానేశ్వర్ ములాయ్ చాలా చక్కగా రాశారని ప్రధాన మంత్రి శ్రీ నరేంద్ర మోదీ అన్నారు.

వారి మహోన్నతమైన కరుణ రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుందని శ్రీ మోదీ అన్నారు.

శ్రీ జ్ఞానేశ్వర్ ములే ఎంఈఏలో మాజీ కార్యదర్శి, కొల్హాపూర్‌కు చెందినవారు. పశ్చిమ మహారాష్ట్రలోని కొల్హాపూర్ నగరానికి పోలాండ్‌తో ఉన్న అపురూపమైన అనుబంధం గురించి టైమ్స్ ఆఫ్ ఇండియాలో ఆయన ఒక వ్యాసం రాశారు.

శ్రీ జ్ఞానేశ్వర్ ములే రాసిన కథనానికి ప్రతిస్పందిస్తూ, ప్రధాన మంత్రి ఒక ఎక్స్ పోస్టులో ఇలా అన్నారు: "కొల్హాపూర్ రాజకుటుంబం, దూరదృష్టి గల మహారాజులు, మహారాణి తారాబాయి గొప్పతనంపై శ్రీ జ్ఞానేశ్వర్ ములే చాలా చక్కని కథనం రాశారు. వారి మహోన్నతమైన కరుణ రాబోయే తరాలకు ఎల్లప్పుడూ స్ఫూర్తినిస్తుంది."

# పోలీసులు వంత పాడుతున్నారు-డిజిపితో కెటిఆర్



హైదరాబాద్, ఆగష్టు 23 :తిరుమలగిరిలో బీఆర్ఎస్ పార్టీ ధర్నా శిబిరంపై కాంగ్రెస్ నేతలు చేసిన దాడిపై బిఆర్ఎస్ నేతలు డిజిపి జితేందర్ రెడ్డికి నేడు ఫిర్యాదు చేశారు. రాష్ట్రంలో బాంబుల సంస్కృతి తిరిగి తీసుకువస్తున్నారని ఆరోపించారు. పోలీసుల స్వయంగా ధర్నా శిబిరంపై దాడి చేయడం, టెంట్ పీకేసే కార్యక్రమాలు చేయడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి, బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ నాయకత్వంలోని ఒక బృందం డిజిపి కార్యాలయంలో జితేందర్ ను కలసి ఒక వినతి పత్రం అందజేశారు..

రాష్ట్రంలో క్షీణించిన శాంతి భద్రతలపైనా కేటీఆర్ ఫిర్యాదు చేశారు రాష్ట్రంలో రుణమాఫీ జరిగిన తీరుపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సొంత గ్రామమైన కొండారెడ్డిపల్లికి పోయిన ఇద్దరు మహిళా జర్నలిస్టులపైన, ఇతర జర్నలిస్టుల పైన దాడి చేసిన తీరునూ డిజిపి దృష్టికి తెచ్చారు. దాడులకు పాల్పడ్డ వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రాష్ట్ర వ్యాప్తంగా కొంతకాలంగా పోలీసులు అత్యుత్సాహంతో ప్రవర్తిస్తున్నారని.. వారిపైన ఓ కన్నేసి ఉంచాలని కోరారు. ప్రతిపక్ష నాయకులపైన పోలీసులు పెడుతున్న అక్రమ కేసులు, చేస్తున్నా హింసపైన ఈ సందర్భంగా కేటీఆర్ డీజీపీకి అధారాలతో వివరించారు. . రాష్ట్ర పర్యాటక శాఖ మంత్రి కొండా సురేఖ పుట్టినరోజు వేడుకల్లో పోలీస్ అధికారులు పాల్గొనడాన్ని కూడా కేటీఆర్.. డీజీపీకి గుర్తుచేశారు.

కేటీఆర్ వెంట ఎమ్మెల్యేలు జగదీశ్ రెడ్డి, ముఠా గోపాల్, మాగంటి గోపీనాథ్, కాలేరు వెంకటేశ్‌తో పాటు పలువురు మాజీ ఎమ్మెల్యేలు, సీనియర్ నాయకులు ఉన్నారు.

# షరతులు లేని రుణమాఫీ చేయాలి.. ఏలేటి మహేశ్వర్ రెడ్డి



ఆదిలాబాద:, ఆగష్టు 23 : కాంగ్రెస్ రుణమాఫీ మోసంపై శుక్రవారం జిల్లా కేంద్రంలోని ఆర్డీవో కార్యాలయం వద్ద బీజేపీ రైతు ధర్నా చేపట్టింది. ఈ ధర్నా కార్యక్రమానికి బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి, ఎంపీ గోడం నగేష్ తో పాటు రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు. ఈసందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ ఈనెల 31వ తేదీ లోపు రాష్ట్రంలోని రైతులందరికీ రెండు లక్షల రుణ మాఫీ చేయకుంటే హైదరా బాదులోని ఇందిరా పార్కు వద్ద నిరవధిక నిరాహార దీక్ష చేపడతానని తెలిపారు.కాంగ్రెస్ ప్రభుత్వం రుణమాఫీ పేరుతో రైతులను మోసం చేసిందన్నారు. రాష్ట్రంలో ఇప్పటి వరకు ఎంత మంది రైతులకు రుణమాఫీ చేశారో శ్వేతపత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 60లక్షల మంది రైతులు రుణమాఫీకి అర్హత ఉంటే కేవలం 22లక్షల మందికి మాత్రమే రుణమాఫీ చేయడం విడ్డూరమన్నారు.

49వేల కోట్లు రుణమాఫీ కి ఇవ్వాల్సి ఉండగా 17వేల కోట్లు మాత్రమే రుణమాఫీ చేశారన్నారు. రాష్ట్ర మంత్రులే పూర్తి రుణమాఫీ కాలేదని చెప్తుంటే ముఖ్యమంత్రి పూర్తి రుణమాఫీ అని చెప్పడం విడ్డూరంగా ఉందని పేర్కొన్నారు.

దేవుళ్లపై ఒట్లు పెట్టి రుణమాఫీ చేశామని మాట తప్పిన ముఖ్యమంత్రి కారణంగా రాష్ట్రానికి అరిష్టం జరిగిందని, తెలంగాణ రాష్ట్రానికి అరిష్టం పోవాలని ప్రతి గుడిలో పూజలు చేస్తామన్నారు. రుణమాఫీ కోసం రైతులకు ప్రభుత్వం రేషన్ కార్డు, ఆధార్ కార్డు పేరుతో ఆంక్షలు పెట్టడం సరికాదని తెలిపారు. వెంటనే ప్రతి రైతుకు రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు. లేనట్లయితే రైతులందరికీ రుణమాఫీ అయ్యే వరకు రైతుల పక్షాన నిలబడి పోరాటం చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర, జిల్లా నాయకులు, రైతులు, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

# వార్సాలోని అనామక సైనిక సమాధివద్ద ప్రధాని ఘన నివాళి

న్యూఢిల్లీ, ఆగష్టు 23:వార్సాలోని అనామక సైనిక ( అన్ నౌన్ సోల్జర్) సమాధివద్ద ప్రధాని శ్రీ నరేంద్ర మోదీ ఘన నివాళి అర్పించారు.

దేశ సేవలో ప్రాణత్యాగం చేసిన పోలాండ్ సైనికుల జ్ఞాపకార్థం నిర్మించిన గౌరవ స్మారక చిహ్నమే అనామక సైనిక సమాధి. దీన్ని ప్యూసోవస్కి స్క్వేర్ వద్ద నిర్మించారు. ఇది పోలాండ్ లో గౌరవప్రదమైన, పేరొందిన జాతీయ స్మారక చిహ్నం.

ప్రధాని ప్రకటించిన ఘన నివాళి భారతదేశం, పోలాండ్ దేశాల మధ్యనగల ఉన్నతమైన గౌరవ మర్యాదలకు, సంఘీభావానికి నిదర్శనంగా నిలుస్తోంది.

# డీసీసీబీ నూతన చైర్మన్ గా విష్ణువర్ధన్ రెడ్డి ఎన్నిక..



మహబూబ్‌నగర్, ఆగష్టు 23 : జిల్లా కేంద్ర సహకార బ్యాంకు నూతన చైర్మన్ గా వనపర్తి జిల్లాకు చెందిన మామిళ్ళపల్లి విష్ణువర్ధన్ రెడ్డి ఏకగ్రీవంగా ఎంపికయ్యారు. ఎన్నికైన చైర్మన్ కు ఎన్నికల నిర్వహణ అధికారి టైటస్ పాల్ శుక్రవారం నియామక పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఉమ్మడి జిల్లాల ఎమ్మెల్యేలు,డైరక్టర్లు నూతనంగా ఎన్నికైన చైర్మన్ కు శుభాకాంక్షలు తెలియజేశారు.

ఈసందర్భంగా నూతన చైర్మన్ విష్ణువర్ధన్ రెడ్డి మాట్లాడుతూ అందరి సహకారంతో రైతు సంక్షేమానికి కృషి చేస్తూ బ్యాంక్ అభివృద్ధికి పాటుపడతానని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యేలు యెన్నం శ్రీనివాస్ రెడ్డి, వాకిటి శ్రీహరి, మేఘా రెడ్డి, డాక్టర్ పర్నికా రెడ్డి, జీఎంఆర్, అనిరుధ్ రెడ్డి, మైనారిటీ కార్పోరేషన్ చైర్మన్ ఓబేదుల్లా కొత్వాల్, తదితరులు పాల్గొన్నారు.

# వ్యవసాయ సంబంధ గణాంకాల నాణ్యతను పెంచాలన్న ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య నిరంతర సహకారం ఎంతైనా అవసరం: శ్రీ దేవేశ్ చతుర్వేది

న్యూఢిల్లీ, ఆగష్టు 23:వ్యవసాయం-రైతుల సంక్షేమం మంత్రిత్వ శాఖ కార్యదర్శి శ్రీ దేవేశ్ చతుర్వేది అధ్యక్షతన ఒక జాతీయ స్థాయి సమావేశాన్ని భారత ప్రభుత్వ వ్యవసాయం-రైతుల సంక్షేమ మంత్రిత్వ శాఖ న్యూ ఢిల్లీలో ఈ రోజున నిర్వహించింది. దేశమంతటా వ్యవసాయ గణాంకాలను మెరుగుపరచాలన్న ధ్యేయంతో సరికొత్త కార్యక్రమాలపై తర్కించి చర్చోపచర్చలు చేయడానికి అన్ని రాష్ట్రాల సీనియర్ అధికారులు ఈ కార్యక్రమంలో భాగంగా సమావేశమయ్యారు. విధానాలకు రూపకల్పన, వ్యాపార నిర్ణయాలతో పాటు వ్యావసాయిక ప్రణాళిక రచనలో సైతం కీలకం అయిన వ్యవసాయ సంబంధిత గణాంకాల్లో కచ్చితత్వాన్ని, విశ్వసనీయతను, పారదర్శకత్వాన్ని పెంపొందింప చేయాలనేదే ఈ కార్యక్రమం ఉద్దేశంగా ఉంది.

వ్యవసాయ ఉత్పత్తి సంబంధిత అంచనాలను పెంచడంతో పాటు డేటా తాలూకు కచ్చితత్వాన్ని పటిష్ట పరచడానికి సాంకేతిక విజ్ఞానాన్ని ఏకీకరించాలన్నది ఈ సమావేశం దృష్టి సారించిన ప్రధానాంశంగా ఉంది. ఈ సంవత్సరం బడ్జెటు ప్రసంగంలో ప్రకటించిన డిజిటల్ క్రాప్ సర్వేక్షణ కచ్చితమైన పంటల విస్తీర్ణ అంచనాకు మార్గాన్ని సుగమం చేసింది. ఇది పంటల సంబంధిత ప్రాంతాలకు జియో టాగ్ సహాయంతో నిర్దిష్ట పొలంవారీ డేటాను అందించనుంది. ఈ డేటా యదార్థ విషయాలకు ఏకైక వనరుగా కూడా ఉపయోగపడుతుంది. దేశ వ్యాప్తంగా ప్రధాన పంటలన్నింటికీ ఉద్దేశించిన శాస్త్రీయంగా రూపొందించిన పంట కోతల ప్రయోగాల ఆధారంగా దిగుబడిని లెక్కగట్టడానికి గాను డిజిటల్ జనరల్ క్రాప్ ఎస్టిమేషన్ సర్వే (డిజిసిఇఎస్)ను మొదలు పెట్టడమైంది. ఈ కార్యక్రమాలు నేరుగా పొలం నుంచి దాదాపుగా వాస్తవ కాలం మరియు విశ్వసించదగిన డేటాను సమకూర్చుతాయన్న ఆశ ఉంది. అదే జరిగితే పంటల ఉత్పాదనను మరింత నిక్కచ్చితనంతో అంచనా వేయడం సాధ్యపడుతుంది.

పంటల ఉత్పత్తి సంబంధిత గణాంకాల తాలూకు కచ్చితత్వాన్ని, విశ్వసనీయతను పెంచడానికి రిమోట్ సెన్సింగ్, భూస్థానిక విశ్లేషణ (జియోస్పేషల్ అనాలిసిస్), కృత్రిమ మేధ (ఏల్టర్నేటివ్ ఇంటెలిజెన్స్.. ఎఐ) వంటి అత్యాధునిక సాంకేతికతలను ఏకీకృతం చేయవలసిన అవసరాన్ని ఈ సమావేశం లో స్పష్టం చేయడమైంది. పునర్ వ్యవస్థీకరించిన ఎఫ్ఎఎస్ఎఎల్ (ఫోర్ కాస్టింగ్ అగ్రికల్చర్ అవుట్ పుట్ యూజింగ్ స్పేస్, అగ్రో-మెటియోరాలజీ, అండ్ లాండ్-బేస్డ్ అబ్జర్వేషన్స్) అండతో పంటల ఉత్పత్తి సంబంధిత గణాంకాలను సిద్ధం చేయడానికి గాను సాంకేతికతను అందించే విషయంలో వ్యవసాయం-రైతుల సంక్షేమం విభాగం వివిధ కార్యక్రమాలను చేపట్టింది. ఈ కార్యక్రమాలపై సమావేశంలో కూలంకషంగా చర్చించారు. ఉన్నతీకరించిన ఈ నమూనా కచ్చితమైన పది ప్రధానమైన పంటలకు సంబంధించి నిర్దుష్ట క్రాప్ మేపులను మరియు విస్తీర్ణాన్ని అంచనా వేసేందుకు రిమోట్ సెన్సింగ్ సాంకేతికతను ఉపయోగించుకొంటుంది. పంట దిగుబడి ముందస్తు అంచనాల విషయంలో స్పేస్ అప్లికేషన్ సెంటర్, భారతీయ వ్యవసాయ పరిశోధన సంస్థ (ఐఎఆర్ఐ), ఇండియన్ స్టాటిస్టికల్ ఇన్స్ టిట్యూట్, భారతీయ వ్యవసాయ గణాంకాల పరిశోధన సంస్థ, ఇంకా ఇన్స్ టిట్యూట్ ఆఫ్ ఇకనామిక్ గ్రోత్ వంటి వివిధ ప్రత్యేక సామర్థ్యం కలిగిన సంస్థలతో సమన్వయాన్ని నెలకొల్పుకోవడమైంది. ఈ సంస్థలు అఖిల భారత స్థాయిలో ఎంపిక చేసిన పంటల దిగుబడి అంచనాలను సిద్ధం చేయడానికి వేరు వేరు నమూనాలపై కృషి చేయవలసి ఉంటుంది. ఇవే తరహా నమూనాలను వేరు వేరు రాష్ట్రాలు పంట బీమా సంబంధిత ఎన్-టెక్ (జవబ-ువఇ్ష్ట్ర) కార్యక్రమాలలో భాగంగా కూడా ఉపయోగించుకొంటున్నాయి.

సమావేశంలో మరొక కీలకమైన కోణం ఏమిటి అంటే, అది యుపిఎజి పోర్టల్ (జఖంణ ఖనీతీబిజీశ్రీ) ను ఉపయోగించుకొంటూ, వ్యవసాయ సంబంధ సమాచారాన్ని మూడు కోణాలలో విశ్లేషించి, ఆ సమాచారం తాలూకు సక్రమతను నిర్ధారించడమే అని చెప్పాలి. ఈ వేదిక బహుళ మార్గాలలో వచ్చే సమాచారాన్ని సరిచూడడానికి మార్గాన్ని సుగమం చేసి, తద్వారా వ్యవసాయ సంబంధ గణాంకాల సుదృఢత్వానికి పూచీ పడుతుంది. దీనిలో కచ్చితమైన పంట అంచనాల రూపకల్పన కోసం వేరు వేరు మార్గాలను కలిపేందుకు ఒక ఉన్నత స్థాయి డేటా నిర్వహణ వ్యవస్థ ఇమిడిపోయివుంది. ఇది రుజువులపై ఆధారపడి నిర్ణయాలు తీసుకోవడంలో తోడ్పడుతుంది; అంతేకాకుండా, విధాన రూపకర్తలకు, సంబంధిత వర్గాలన్నింటికీ వ్యవసాయ పరమైన డేటా సంబంధి లభ్యత కు గాను కేంద్రీయ హబ్ గా కూడాను పనిచేస్తుంది.

గణాంకాలు, కార్యక్రమాల అమలు మంత్రిత్వ శాఖ (ఎమ్ఒఎస్‌పిఐ)తో వ్యవసాయం-రైతుల సంక్షేమ విభాగం జట్టుకట్టాలని కూడా ఈ సమావేశం నొక్కిచెప్పింది. ఇదే జరిగితే నేషనల్ శాంపుల్ సర్వే ఆఫీస్ (ఎన్ఎస్ఎస్ఒ) అందించే దశల వారీ ప్రణాళిక సాయంతో పంటకోతల ప్రయోగాలపై పర్యవేక్షణను అధికం చేయవచ్చు; అంతేకాక, సిసిఇ మరియు రాష్ట్ర స్థాయి దిగుబడి అంచనాల్లో నాణ్యతను స్వతంత్ర ఏజెన్సీ తో నిర్ధారించడం సాధ్యమవుతుంది.

ఈ కొత్త కార్యక్రమాలతో సిద్ధించే లాభాలను వివరించే ఒక సమగ్రమైన సమర్పణ కూడా ఈ సమావేశంలో చోటుచేసుకొంది. డిజిటల్ సర్వేక్షణలు, ఉన్నత స్థాయి సాంకేతికతలను అనుసరిస్తే ఏ విధంగా డేటా సేకరణను మరింత పక్కాగా మారుస్తుందో, ఆ ప్రక్రియలో లోటుపాటుల తగ్గుదలకు మార్గాన్ని సుగమం చేస్తుందో, వ్యవసాయ రంగంలో మెరుగైన విధాన నిర్ణయాలను తీసుకోవడంలో తోడ్పాటును అందిస్తుందో ఈ సమర్పణ ప్రముఖంగా చాటిచెప్పింది.

శ్రీ దేవేష్ చతుర్వేది మాట్లాడుతూ, వ్యవసాయ సంబంధ గణాంకాల నాణ్యతను పెంచాలన్న ఉమ్మడి లక్ష్యాన్ని సాధించడానికి కేంద్రానికి, రాష్ట్ర ప్రభుత్వాలకు మధ్య నిరంతర సమన్వయం ఏర్పడవలసిన అవసరాన్ని నొక్కి చెప్పారు. ఈ కొత్త కొత్త కార్యక్రమాలను సకాలంలో అమలుపరుస్తూ, వాటి ప్రభావవంతమైన ఫలితాల సాధన దిశగా చొరవ తీసుకోవలసిందిగా రాష్ట్రాలకు ఆయన సూచించారు.

ఈ విధమైన సంస్కరణల ప్రాముఖ్యం విషయంలో ఏకాభిప్రాయంతోను, అన్ని రాష్ట్రాలు వ్యవసాయ రంగం గణాంక సంబంధి వ్యవస్థను బలపరచడానికి కలిసికట్టుగా పనిచేయాలన్న వాగ్దానంతోను ఈ సమావేశం ముగిసింది. భారతదేశంలో వ్యవసాయ రంగం సమగ్ర అభివృద్ధికి ఇవి ఎంతో కీలకం.



# ఫార్మా బాధితులకు జగన్ పరామర్శ

-తక్షణమే పరిహారం చెల్లించాలి
-ఇవ్వకపోతే నేనే ధర్నా చేస్తా
-ప్రభుత్వ స్పందన దారుణం
-పక్కదారి మళ్లింపుపైనే తాపత్రయం
-బాధితులకు అండగా ఉంటా
-అనకాపల్లిలో వైసీపీ అధినేత జగన్

అమరావతి, ఆగష్టు 23 :అచ్యుతాపురం సెజ్ లో దుర్ఘటనలో చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరించిన తీరు బాధాకరమని వైఎస్. జగన్ మోహన్ రెడ్డి అన్నారు. శుక్రవారం ఉదయం అనకాపల్లిలోని ఉషా ప్రైమ్ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుల్ని పరామర్శించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, అచ్యుతాపురం ఘటనలో ప్రభుత్వ తీరు సరికాదు. ఘటన జరిగింది రాత్రి కాదు పట్టపగలు.



-ఈ ప్రభుత్వం పూర్తిగా నిర్లక్ష్యంగా వ్యవహరించింది. పర్యవేక్షణకు వెళుతున్నట్టు హెం మంత్రి అన్న మాటే -. కార్మిక శాఖ మంత్రి కూడా తన దగ్గర ప్రమాదం వివరాలు లేవన్నారు. ఎంత మంది చనిపోయారో తెలియదన్నారు. ఈ ఘటనపై స్పందించకూడదనే తాపత్రయం ప్రభుత్వంలో కనిపించింది అని వైసీపీ అధినేత జగన్ మోహన్ రెడ్డి అన్నారు. ఘటనా స్థలానికి అంబులెన్సులు కూడా రాని పరిస్థితి, బాధితుల్ని కంపెనీ వాహనాల్లో తీసుకొచ్చారు.

### గంటల వ్యవధిలోనే స్పందించాం

ఇలాంటి ఘటనే మా హయాంలో జరిగింది. అదీ కోవిడ్ సమయంలో. ఎల్జీ పాలీమర్స్ ఘటనలో 24 గంటల్లోపే పరిహారం ఇప్పించాం. కోటి రూపాయల పరిహారం ఇచ్చిన తొలి ప్రభుత్వం మాదే. అప్పుడు ప్రమాదం జరిగిన వెంటనే పాలక, ప్రభుత్వ యంత్రాంగం స్పందించింది. తెల్లవారుజామున ప్రమాదం జరిగిన కాసేపటికే కలెక్టర్ ఘటనా స్థలానికి వెళ్లారు.

నేనే ఉదయం 11 గంటలకు ప్రమాద స్థలానికి వెళ్లాను. గంట్లలోనే రూ.30 కోట్లు పరిహారం సొమ్ము పంపించాం. గతంలో ఏ ప్రభుత్వం మా ప్రభుత్వంలా స్పందించలేదు. అని జగన్ మోహన్ రెడ్డి వివరించారు.

### బాధితులకు అండగా ఉంటాం

ఇప్పుడు ఈ ప్రభుత్వం స్పందించిన తీరు బాధగా అనిపిస్తోందని. ఈ ఫ్యాక్టరీలో ప్రమాదంలో ఎలా జరిగిందో లోతైన దర్యాప్తు చేయాలని జగన్ డిమాండ్ చేశారు. పరిహారం అనేది సానుభూతితో ఇవ్వాలి. తగిన సమయంలో ఇవ్వాలి.

ఇప్పటివరకు ఒక రూపాయి ముట్టలేదు. ఇవ్వాల్సిన పరిహారం వెంటనే ఇవ్వాలి. పరిశ్రమల్లో ప్రమాదాలు జరగకుండా తగిన చర్యలు తీసుకోండి. ఇటువంటి ప్రమాదాలు పునరావృతం కాకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. బాధితులకు పరిహారం ఇవ్వకపోతే నేను వచ్చి. స్వయంగా ధర్నా చేస్తాను. బాధితులకు అండగా ఉంటాను. అని ప్రభుత్వానికి జగన్ మోహన్ రెడ్డి వార్నింగ్ ఇచ్చారు.

# 108లో గర్భిణి మహిళా ప్రసవం.. తల్లీ బిడ్డ క్షేమం..

ఆదిలాబాద:, ఆగష్టు 23 :కొమరం భీం ఆసిఫాబాద్ జిల్లా సిర్పూర్ (యు) మండలంలోని జాముల్దార గ్రామానికి చెందిన కినక పార్వతి గర్భిణి మహిళలకు పురిటి నొప్పులు రావడంతో ప్రసూతి కోసం 108 అంబులెన్స్ లో ఆసుపత్రికి తరలిస్తుండగా మార్గమధ్యంలోనే అంబులెన్స్ లో ప్రసవించి మగ బిడ్డకు జన్మనిచ్చిందని 108 రామేశ్వరి పైలట్ అడ దయాకర్ తెలిపారు.

మెరుగైన చిరుతల కోసం ఆసుపత్రికి తరలించామని పేర్కొన్నారు. తల్లీ బిడ్డ క్షేమంగా ఉన్నారని తెలిపారు. 108లో గర్భిణీ మహిళకు ఎలాంటి హాని జరగకుండా ప్రసూతి చేసిన ఈఏంటీ రామేశ్వరికి మహిళ బంధువులు కృతజ్ఞతలు తెలిపారు.

# రైతు ఆందోళనకు మా మద్దతు- ధర్మపురి అరవింద్

నిజామాబాద్, ఆగష్టు 23 :సాధ్యం కానీ హామీలను ఇచ్చి మోసం చేసిన కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలపై, రుణమాఫీపై రైతులు చేపడుతున్న ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. శుక్రవారం నిజామాబాద్ జిల్లా కేంద్రంలోని బీజేపీ జిల్లా పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎంపీ ధర్మపురి అరవింద్ మాట్లాడుతూ ఎన్నికల్లో సాధ్యం కాని హామీలను ఇచ్చి రైతులను, మహిళలను, యువతను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా మోసం చేసిందని ధ్వజమెత్తారు. రైతులందరికీ రుణమాఫీ చేస్తామని కల్లబొల్లి మాటలు చెప్పి కేవలం 30శాతం మంది రైతులకు రుణమాఫీ చేయడం సిగ్గుచేటన్నారు. సీఎం రేవంత్ రెడ్డి రొటేషన్ చక్రవర్తి అని ఎద్దేవా చేశారు.



జేబులు నింపుకోవడం తప్ప ప్రజా సంక్షేమంపై శ్రద్ధ లేదని మండిపడ్డారు. గత వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో రుణమాఫీ చేసిన తీరు అభినందనీయమని ఈ సందర్భంగా గుర్తు చేశారు. ప్రజల్లో రేవంత్ రెడ్డి సర్కారుపై రోజురోజుకీ అసహనం పెరిగిపోతుందన్నారు. వడ్డీలేని రుణాలు ఇచ్చిన ఘనత ప్రధాని మోదీకే దక్కుతుందన్నారు. తెలంగాణ రాష్ట్రానికి కేసీఆర్ చిప్ప చేతికిచ్చిందని విమర్శించారు. కేసీఆర్ లాగే రేవంత్ కూడా అబద్ధాలు చెబుతూ కాలం వెళ్ళదీస్తున్నారని మండిపడ్డారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతులందరికీ ఆంక్షలు లేని రుణమాఫీని వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేశారు. రైతు సంక్షేమాన్ని మరిచిన కాంగ్రెస్ ప్రభుత్వంపై ఐక్య కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో ఇవాళ చేపడుతున్న ఆందోళనకు తమ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నట్లు ఎంపీ ధర్మపురి అరవింద్ తెలిపారు. ఈ కార్యక్రమం లో బీజేపీ రాష్ట్ర నాయకులు పల్లె గంగారెడ్డి, నాయకులు తిరుపతి రెడ్డి, పోతాన్కర్ లక్ష్మీనారాయణ, బీజేపీ ఫ్లోర్ లీడర్ స్రవంతి రెడ్డి, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

# ఎస్బీఐ బ్యాంకు ప్రైవేటు ఉద్యోగిపై కేసు నమోదు..

ఆదిలాబాద్, ఆగష్టు 23 :మంచిర్యాల జిల్లా జన్నారం మండల కేంద్రంలోని ఎస్బీఐలో దినసరి ఉద్యోగి ఎఫ్.ఓ.ఎస్. పి.సాయిరాంపై కేసు నమోదు చేసినట్లు స్థానిక ఎస్ ఎస్ రాజవర్ధన్ శుక్రవారం తెలిపారు. పంట రుణమాఫీ విషయంలో మండలంలోని కవ్వాల హాస్టల్‌కు చెందిన రైతు ఎర్రయ్య నుంచి రూ.15వేలు లంచం తీసుకున్నట్లు రైతు ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

సాయిరామ్ పై సస్పెన్షన్ వేటు

ఎస్బీఐలో ప్రైవేట్ ఉద్యోగి ఎఫ్.ఓ.ఎస్. పి.సాయికుమార్ పై ఎస్బీఐ శాఖ మంచర్యాల రీజనల్ మేనేజర్ రితీష్ కుమార్ విచారణ చేపట్టారు. పలువురు రైతులు, బ్యాంకు ఉద్యోగులను అడిగి వాస్తవాలను తెలుసుకున్నారు. కాగా, సాయిరామ్ ను సస్పెండ్ చేసినట్లు స్థానిక ఎస్బీఐ మేనేజర్ మహేష్ తెలిపారు. హాస్టల్ తండా రైతు ఎర్రయ్య నుంచి రూ.15వేలు లంచం తీసుకున్నాడనే ఆరోపణల మేరకు మంచిర్యాల రీజినల్ మేనేజర్ రితీష్ కుమార్? సాయిరామ్ ను సస్పెండ్ చేసినట్లు ఆయన చెప్పారు.

# 25 యుఎస్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో కెరీర్ మొజాయిక్ సమావేశం..




హైదరాబాద్, ఆగష్టు 23 : 450కు పైగా యుఎస్ విశ్వవిద్యాలయాలు, 900కు పైగా ప్రముఖ ప్రపంచ సంస్థలకు ప్రాతినిధ్యం వహిస్తున్న దక్షిణాసియాలోని అతిపెద్ద విద్యార్థుల నియామక సంస్థ కెరీర్ మొజాయిక్ హైదరాబాద్‌లో 25 యుఎస్ విశ్వవిద్యాలయ ప్రతినిధులతో ఒక సమావేశం నిర్వహించింది. కొత్త కోర్సులు, స్కాలర్‌షిప్‌లు అండ్ తదితర అంశాలను పంచుకోవడంపై ఈ విశ్వవిద్యాలయాలు దృష్టి సారించి, కళాశాల క్యాంపస్‌లలోని విద్యార్థులు, కళాశాల సలహాదారులు, ఆంధ్రప్రదేశ్ (ఏపీ) తెలంగాణా నుండి స్టడీ అబ్రాడ్ కన్సల్టెంట్‌లతో సమావేశమయ్యాయి.

కెరీర్ మొజాయిక్ వ్యవస్థాపకుడు అండ్ డైరెక్టర్ అభిజిత్ జవేరి మాట్లాడుతూ ఈ కార్యక్రమం ఆంధ్రప్రదేశ్ తెలంగాణలోని విద్యార్థులకు విద్యావకాశాలను మెరుగ్గా తీసుకురావాలనే లమ అచంచలమైన నిబద్ధతను వెల్లడిస్తుందన్నారు. ఈ రాష్ట్రాలు భారతదేశం అంతర్జాతీయ విద్యారంగంలో కీలకమైన మార్కెట్‌లుగా ఉద్భవించాయన్నారు. ప్రత్యేకించి టైర్-2, టైర్-3 నగరాల నుండి దరఖాస్తులు గణనీయంగా పెరిగాయన్నారు.

గ్లోబల్ ఎడ్యుకేషన్ పట్ల విద్యార్థుల పెరుగుతున్న ఆకాంక్షలను ఇది ప్రతిబింబిస్తుందన్నారు. 450కి పైగా యుఎస్ విశ్వవిద్యాలయాలు, అగ్రశ్రేణి గ్లోబల్ సంస్థలతో తమ విస్తృతమైన నెట్‌వర్క్ ఈ ప్రాంతాల విద్యార్థుల ప్రత్యేక అవసరాలను తీర్చడానికి తగిన మార్గదర్శకత్వాన్ని అందించడానికి తమకు సహాయం చేస్తుందన్నారు

# పొంగులేటికి అంత శ్రమ అవసరం లేదు..

## అన్ని శాటిలైట్ ఇమేజ్‌లు ఉన్నాయి : కేటీఆర్



హైదరాబాద్, ఆగష్టు 23 : ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌ల పరిధిలో అక్రమంగా ఉన్న భవనాలన్నీ కూల్చాల్సిందే.. నేతల భవనాలను కూల్చిన తర్వాత సామాన్యులవి కూల్చాలని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కాంగ్రెస్ ప్రభుత్వానికి సూచించారు. బీఆర్ఎస్ కార్యకర్తలపై కాంగ్రెస్ పార్టీ శ్రేణుల దాడులు, పోలీసు నిర్లక్ష్య వైఖరిపై రాష్ట్ర డీజీపీని కేటీఆర్, సీనియర్ నాయకులు కలిసి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా కేటీఆర్ మీడియాతో మాట్లాడారు. తన ఇల్లు బఫర్ జోన్ పరిధిలోని లేదని పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి చెబుతున్నారని ఓ మీడియా ప్రతినిధి కేటీఆర్‌ను ప్రశ్నించగా.. ఆయన ఈ విధంగా బదులిచ్చారు.

పొంగులేటికి అంత శ్రమ అవసరం లేదు. ఎఫ్‌టీఎల్, బఫర్ జోన్‌లో ఉన్న నిర్మాణాలకు సంబంధించి శాటిలైట్ మ్యాప్స్ ఉన్నాయి. ఆయన అంత బాధపడాల్సిన అవసరం కూడా లేదు. ఎలా చెరువులు పూడ్చి కట్టారో అవన్నీ కూడా శాటిలైట్ ఇమేజెస్ ఉన్నాయి. చూసుకోండి.. రంగనాథ్ గారితో మాట్లాడుకోమనండి. ఎఫ్‌టీఎల్, బఫర్‌లో ఉన్న నిర్మాణాలను మొదట కూల్చడం ప్రారంభించండి. పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, వివేక్, కేవీపీ రామచంద్రరావు, మధుయాష్కీ, గుత్తా సుఖేందర్ రెడ్డి లాంటి నేతల భవనాలను కూల్చేసి ఆ తర్వాత సామాన్యుల భవనాలను కూల్చేయండి అని కేటీఆర్ సూచించారు.

# గంజాయి విక్రయిస్తున్న ఐదుగురు మహిళలు అరెస్ట్

హైదరాబాద్, ఆగష్టు 23 :అక్రమ మార్గంలో డబ్బు సంపాదించడానికి ఆడ, మగ తేడా లేకుండా పోయింది. ఈజీ మనీ వస్తుందంటే చాలు అడ్డదారుల్లో నడవడానికి చాలామంది సిద్ధపడుతున్నారు. నిషేధిత గంజాయిని విక్రయిస్తున్న ఐదుగురు మహిళలను ఎక్సైజ్, ఎస్టీఎఫ్ పోలీసులు పట్టుకున్నారు. అయిదుగురు మహిళల వద్ద 11.3 కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. పోలీసులుతెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి.లోయర్ దూల్‌పేట్‌లోని జుంగూర్ బస్తీలో కమలా బాయి అనే మహిళ అమ్మకాలు సాగిస్తుండగా ఆమెను అదుపులోకి తీసుకున్నారు. ఇలా ఐదుగురు మహిళల వద్ద మొత్తంగా 11.3 కేజీల గంజాయిని పట్టుకున్నట్లు పోలీసులు తెలిపారు. పట్టుబడిన వారిలో కమలాబాయి, దుర్గా సింగ్, దివ్య సింగ్ దీక్ష సింగ్ నేహా సింగ్ ఉన్నారు. నిందితులపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. ఎవరైనా గంజాయి అమ్మినా, సరఫరా చేసిన కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

# బ్యాంకులో భారత ప్రభుత్వానికి ఉన్న రూ. 76.32 కోట్ల వాటా మూలధనానికి 25 శాతం చొప్పున డివిడెండ్ చెక్కు

న్యూఢిల్లీ, ఆగష్టు 23:దేశీయ వ్యవహారాలు, సహకార శాఖ కేంద్ర మంత్రి శ్రీ అమిత్ షా కు రెప్కో బ్యాంకు డివిడెండ్ రూపంలో 19.08 కోట్ల రూపాయల విలువైన ఒక చెక్కును న్యూఢిల్లీలో అందజేసింది.

బ్యాంకులో భారత ప్రభుత్వానికి 76.32 కోట్ల రూపాయల షేర్ కేపిటల్ ఉండగా, 2023-24 ఆర్థిక సంవత్సరంలో 25 శాతం వంతున డివిడెండ్ రూపేణా 19.08 కోట్ల రూపాయలకు ఒక చెక్కును రెప్కో బ్యాంకు చైర్మన్ శ్రీ ఇ. సంతానం, బ్యాంకు మేనేజింగ్ డైరెక్టరు శ్రీ ఒ.ఎమ్. గోకుల్ లు కేంద్ర మంత్రి కి అందజేశారు. ఈ కార్యక్రమంలో కేంద్ర దేశీయ వ్యవహా రాల మంత్రిత్వ శాఖ (ఎమ్‌హెచ్‌ఎ) కార్యదర్శి శ్రీ అజయ్ కుమార్ భల్లా, ఎమ్‌హెచ్‌ఎ లో ఆఫీసర్ ఆన్ స్పెషల్ డ్యూటీ (ఒఎస్‌డి) శ్రీ గోవింద్ మోహన్ లు కూడా పాల్గొన్నారు. దేశీయ వ్యవహారాల మంత్రిత్వ శాఖ (ఎమ్‌హెచ్‌ఎ) పాలన పరమైన నియంత్రణలో నడుస్తున్నభారత ప్రభుత్వ వాణిజ్య వ్యవస్థే రెప్కో బ్యాంకు. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈ బ్యాంకు వ్యాపార పరిమాణం 11 శాతం వృద్ధి చెందింది .

బ్యాంకు 20,000 కోట్ల రూపాయల విలువైన వ్యాపార కార్యకలాపాలను ఈ రోజున అధిగమించి ఒక ప్రశంసాయోగ్యమైన కార్యసాధన మైలురాయిని చేరుకొంది.

# తొలి జాతీయ అంతరిక్ష దినోత్సవ శుభాకాంక్షలు: ప్రధాని శ్రీ నరేంద్రమోదీ

న్యూఢిల్లీ, ఆగష్టు 23:మొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ప్రధానమంత్రి శ్రీ నరేంద్రమోదీ దేశ ప్రజలకు హృదయపూర్వక శుభాకాంక్షలు తెలియజేశారు. అంతరిక్ష రంగంలో భారత్ సాధిస్తున్న అద్భుత విజయాలను సామాజిక మాధ్యమ వేదిక 'ఎక్స్' లో ప్రశంసించారు

"అందరికీ మొదటి జాతీయ అంతరిక్ష దినోత్సవ శుభాకాంక్షలు. అంతరిక్ష రంగంలో మనదేశం సాధిస్తున్న విజయాలను మనం గర్వంగా గుర్తు చేసుకుందాం. అంతరిక్ష శాస్త్రవేత్తలు అందిస్తున్న సేవలను మెచ్చుకోవాల్సిన రోజు ఇది" అని ప్రధాని మోదీ అన్నారు.

అంతరిక్ష రంగాన్ని అభివృద్ధి చేయడంలో ప్రభుత్వ నిబద్ధతను తెలియజేస్తూ "భవిష్యత్తులో ఈ రంగానికి అవసరమైన నిర్ణయాలు మా ప్రభుత్వం తీసుకుంది. రానున్న కాలంలో మరిన్ని నిర్ణయాలు తీసుకుంటుంది" అని ప్రధానమంత్రి పేర్కొన్నారు.

# నీలోఫర్ హాస్పిటల్‌కు క్యూ కడుతున్న రోగులు.. ఎమర్జెన్సీ వార్డులో బెడ్లు లేక రోగుల ఇక్కట్లు

హైదరాబాద్, ఆగష్టు 23 :సీజనల్ వ్యాధులతో ప్రభుత్వ నీలోఫర్ హాస్పిటల్ రోగులతో కిక్కిరిసిపోతున్నది. ఎమర్జెన్సీ వార్డులోబెడ్లు లేక రోగుల ఇక్కట్లు పడుతున్నారు. ఎమర్జెన్సీ వార్డులో బెడ్లు లేకపోవడంతో చిన్న పిల్లల తల్లిదండ్రులు కింద కూర్చొని మరీ చికిత్స అందించుకుంటున్న దయనీయమైన దృశ్యాలు నిత్యకృత్యమయ్యాయి. ఒకే బెడ్డు పై ముగ్గురు, నలుగురు పిల్లలను వైద్యులు పడుకోబెడుతుండటం సమస్య తీవ్రతకు అద్దం పడుతున్నది.

ఇలా చేయడం వల్ల ఒకరి వ్యాధి మరొకరికి సోకే ప్రమాదం ఉందని తల్లిదండ్రులు భయభ్రాంతులకు గురవుతున్నారు. నిత్యం హాస్పిటల్‌కు వచ్చే రోగులసంఖ్య క్రమంగా పెరుగుతోంది. వైరల్ జ్వరాల బారిన పడుతూ జనం అవస్థలకు గురవుతున్నారు. వెంటనే ప్రభుత్వం దృష్టి పెట్టి ఎమర్జెన్సీ వార్డులో బెడ్లను సమకూర్చాలని రోగులు కోరుతున్నారు.

ఆహ్వానం
వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా - శ్రీ త్యాగరాయ గానసభ
(వ్యవస్థాపకులు : డా॥ వంగూరి చిట్టెన్‌రాజు, అమెరికా) సంయుక్త ఆధ్వర్యంలో
25-08-2024 ఆదివారం సా॥ 5:30 గం॥లకు, కళా సంగీత నృత్య వేదిక, మొదటి అంతస్తు
(నూతనంగా నిర్మించిన కళామందిరం - లిఫ్ట్ సౌకర్యం కలదు), శ్రీ త్యాగరాయ గానసభ, చిక్కడపల్లి, హైదరాబాదు
నెలనెలా తెలుగు వెన్నెల 181వ కార్యక్రమం

వాఙ్మయ చరిత్రలో కొన్ని వ్యాస ఘట్టాలు మరియు కొన్ని విశేషాంశాలు-గ్రంథకర్త, విద్యారత్న డా॥ ఏల్చూరి మురళీధరరావు (న్యూ ఢిల్లీ) గారిచే మహాకవి ఏర్చూరి సింగనామాత్యుడు (శ్రీమహాభాగవతంలో జాతీయ మహాకవి బమ్మెర పోతనామాత్యులవారితో భాగస్వామ్యం పంచుకున్న మహాకవిని గురించిన విశేషాలతో 'సాహిత్య ప్రసంగం'

11 కథా సంకలనాలు, 15 నవలలు మరియు ఒక వ్యాస సంపుటి రచించిన, ప్రముఖ రచయిత్రి శ్రీమతి గంటి భానుమతి గారి 'నేను-నా రచనలు' ప్రసంగం
సభాధ్యక్షులు : శ్రీ కళా జనార్ధనమూర్తి గారు, అధ్యక్షులు, శ్రీ త్యాగరాయ గానసభ
స్వాగతోపన్యాసం : కళాబ్రహ్మ, శిరోమణి డా॥ వంశీ రామరాజు గారు, మేనేజింగ్ ట్రస్టీ - వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (భారతదేశ విభాగం)
సభానిర్వహణ : శ్రీమతి శ్రీపేరి గారు, రచయిత్రి
కళా శారద దీక్షితులు, ప్రధాన కార్యదర్శి, శ్రీ త్యాగరాయ గానసభ
డా॥ తెన్నేటి సుధాదేవి, చైర్‌పర్సన్, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (భారతదేశ విభాగం)
శైలజ సుంకరపల్లి, ట్రస్టీ, వంగూరి ఫౌండేషన్ ఆఫ్ అమెరికా (భారతదేశ విభాగం)
ఈ కార్యక్రమాన్ని ... ద్వారా వీక్షించవచ్చు.

# కీచక ఉపాధ్యాయుడిపై వేటు పడింది..

హైదరాబాద్, ఆగష్టు 23 :కొత్తగూడెంలోని సింగరేణి కాలరీస్ ఉన్నత పాఠశాలలో ఇటీవల బదిలీపై వచ్చిన తెలుగు ఉపాధ్యాయుడు బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించినట్లు వచ్చిన ఆరోపణలపై నేపథ్యంలో అతడిపై సస్పెన్షన్ వేటు వేస్తూ సింగరేణి ఎడ్యుకేషనల్ సొసైటీ నిర్ణయం తీసుకుంది.

ప్రస్తుతం ఉపాధ్యాయుడు పోలీసుల అదుపులో ఉన్నారని, తక్షణమే ఇతనిపై పూర్తి స్థాయి విచారణకు ఆదేశించామని జనరల్ మేనేజర్(ఎడ్యుకేషన్) బి.నికోలస్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

విచారణ తర్వాత ఆరోపణలు రుజువైతే తీవ్ర చర్యలు తీసుకోవడానికి వెనకాడబోమని స్పష్టం చేశారు.

ఈ విషయంలో బాలికలు, వారి తల్లిదండ్రులకు పూర్తి భరోసా ఇస్తున్నామని, అలాగే ఇటువంటి ఉదంతాలు పునరావృతం కాకుండా కఠిన నిబంధనలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. సత్ప్రవర్తన లేని ఉపాధ్యాయుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని స్పష్టం చేశారు.

ఈ విషయంలో తల్లిదండ్రులు, విద్యార్థులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, విద్యార్థుల భద్రతకు యాజమాన్యం పూర్తి అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

# బహుముఖ ప్రజ్ఞాశాలి.. రాజా బహదూర్ వెంకటరామరెడ్డి: సీపీ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి



హైదరాబాద్, ఆగష్టు 23 :సమాజానికి దివంగత మాజీ కొత్వాల్ రాజా బహదూర్ వెంకటరామరెడ్డి అందించిన సేవలు నేటి తరానికి స్ఫూర్తిదాయకమని నగర పోలీస్ కమిషనర్ కొత్తకోట శ్రీనివాస్ రెడ్డి అన్నారు. రాజా బహదూర్ వెంకటరామరెడ్డి ఎడ్యుకేషన్ సొసైటీ ఆధ్వర్యంలో బహదూర్ 155వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. గురువారం నారాయణగూడ వైఎంసీఏ చౌరస్తాలోని బహదూర్ విగ్రహానికి పలువురు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం శ్రీనివాస్‌రెడ్డి మాట్లాడుతూ..

తెలంగాణ ప్రాంతంలో విద్య అవకాశాలు లేని సమయంలో విద్యా సంస్థలు, వసతి గృహాలను స్థాపించారని, ఎంతో మందికి విద్యను అందించిన బహుముఖ ప్రజ్ఞాశాలి రాజా బహదూర్ వెంకటరామరెడ్డి అని కొనియాడారు.

నిజాం కాలంలో నగర కొత్వాల్‌గా బాధ్యతలు చేపట్టి ఏకదాటిగా 14 ఏండ్లు పనిచేసి నిజాం ప్రభుత్వం మన్ననలను పొందారని గుర్తు చేశారు. భాగ్యనగరం నడిబొడ్డున మహిళల కోసం ప్రత్యేకంగా కళాశాల, హాస్టల్‌ను ఏర్పాటు చేయడం గర్వించదగ్గ విషయమని పేర్కొన్నారు. విద్యార్థులు ఏ రంగంలోనైనా ఉన్నత శిఖరాలకు చేరుకోవాలంటే రాజా బహదూర్ జీవితం ఆదర్శమని తెలిపారు.

అనంతరం రాజా బహదూర్ వెంకటరామరెడ్డి పేరిట విధి నిర్వహణలో ఉత్తమ సేవలందిస్తున్న హైదరాబాద్, మీర్‌చౌక్ పీఎస్ డీఐ దిలీప్‌కుమార్, సైబరాబాద్, గచ్చిబౌలి ట్రాఫిక్ పీఎస్ సీఐ ఎస్.రాజశేఖర్‌ను బంగారు పతకాలతో సత్కరించి, రూ.5వేల చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో డీసీపీ బి.బాలస్వామి, ఏసీపీ శంకర్, సొసైటీ కార్యదర్శి తీగల మోహన్‌రెడ్డి, నాయకులు సుకన్య రెడ్డి, వాసుదేవారెడ్డి, కృష్ణారెడ్డి, వెంకట్ రాంరెడ్డి, నారాయణగూడ పీఎస్ సీఐ యు.చంద్రశేఖర్, డీఐ నాగార్జున, ఎస్సైలు షఫీ, వెంకటేశ్ తదితరులు పాల్గొన్నారు.

